


epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక




సంపుటి : 19 సంచిక : 129 | 30-07-2026 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | published from Nalgonda, circulated throughout Telanagana state | పేజీలు : 12 వెల: రూ. 1.00



# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

## లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

**అక్షరకలం న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన

- మిగతా2లో...

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

- పర్యావరణ అనుమతులు చెల్లుబాటు
- సుప్రీంకోర్టులో ఉపశమనం



**అక్షరకలం న్యూఢిల్లీ:** తెలంగాణలోని పాలమరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న

- మిగతా2లో...

## మన్మోహన్ సింగ్ పై ఉన్న క్రిమినల్ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు

అక్షరకలం న్యూఢిల్లీ:

-బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారంలో మన్మోహన్ పై కేసు

-సీబీఐ నివేదికను పక్కన పెట్టి ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడంలో

-బలమైన కారణాలు కనిపించడం లేదన్న కోరు

ట-ట్రయల్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థాన

2

## ఈ వాహనాల్లో చిన్న మార్పులు అవసరం..

## ఈ20 పెట్రోల్‌పై కేంద్రం కీలక ప్రకటన

- 2016కు ముందు కొన్ని వాహనాల్లో స్వల్ప మార్పులు అవసరం కావచ్చన్న గడ్కరీ
- బీఎస్-3 వాహనాల్లో రబ్బరు భాగాల మార్పు అవసరం ఉండొచ్చని వెల్లడి
- సాధారణ సర్వీసింగ్‌లో వాటిని మార్చు కుంటే సరిపోతుందని వివరణ
- ఇంజిన్లలో మార్పులు అవసరం లేదన్న అధ్యయనాలు
- ఈ20తో ఇంజిన్ల పనితీరులో పెద్ద మార్పులు లేవని వెల్లడి

అక్షరకలం న్యూఢిల్లీ:

2



## ప్రపంచంలో నాలుగో అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌గా పాకిస్థాన్

అక్షరకలం న్యూఢిల్లీ:

- హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో పాకిస్థాన్‌కు 101వ ర్యాంక్
- కేవలం 29 దేశాలకు మాత్రమే వీసా లేకుండా ప్రయాణించే సౌకర్యం
- ఈ జాబితాలో భారత్ 81, చైనా 60వ స్థానంలో ఉన్నాయి
- ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా సింగపూర్ అగ్రస్థానం




2

- వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- పలు జిల్లాలకు అతి భారీ వర్ష సూచన
- హైదరాబాద్‌లో వర్షానికి స్తంభించిన ట్రాఫిక్
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- పలు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు

2

అక్షరకలం హైదరాబాద్:

## భారీ వర్షాలతో తడిసిముద్దయిన తెలంగాణ.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- శ్రీశైలం జలాశయానికి నేడు చేరనున్న కృష్ణా వరద
- జూరాల ప్రాజెక్టు నుంచి 30,000 క్యూసెక్కుల నీటి విడుదల
- నిండుకుండలా మారిన కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లు
- ప్రస్తుతం శ్రీశైలంలో 41 టీఎంసీల నీరు మాత్రమే
- వరద రాకతో రాయలసీమ రైతుల్లో ఆశలు



2

అక్షరకలం హైదరాబాద్:

## శ్రీశైలానికి కృష్ణా జలాలు.. నేడు జలాశయానికి చేరనున్న వరద

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత



- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయిం చాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

2

అక్షరకలం హైదరాబాద్:

## 'వందేమాతరం'ను అవమానిస్తే ఇకపై శిక్ష.. రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

అక్షరకలం న్యూఢిల్లీ:

- ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణ
- తాజాగా వందేమతరానికీ దాని విస్తరణ
- బిల్లును సమర్థించిన కేంద్రం
- రాష్ట్రపతి ఆమోదం తర్వాతే చట్టం
- సభలో ప్రతిపక్షాల ఆందోళన, వాకౌట్

2

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

-మొదటి పేజీ తరువాయి

అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

-మొదటి పేజీ తరువాయి

ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేందప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

-మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (ఘఖుజా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

# 'వందేమాతరం'ను అవమానిస్తే ఇకపై శిక్ష.. రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

-మొదటి పేజీ తరువాయి



జాతీయ గేయం 'వందేమాతరం'ను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే 'జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు-2026'కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, సీపీఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు చివరి క్షణాల్లో కూడా 'వందేమాతరం' నినాదం చేశారని గుర్తుచేశారు. ఈ బిల్లును వ్యతిరేకించడం జాతీయ నాయకుల భావాలకు విరుద్ధమని మంత్రి వ్యాఖ్యానించారు. దేశ ఐక్యత, జాతీయ భావనను బలోపేతం చేయడమే ఈ చట్టం ఉద్దేశమని చెప్పారు. దర్యాప్తు, చర్చల అనంతరం ప్రతిపక్షం వాకౌట్ చేసిన నేపథ్యంలో రాజ్యసభ బిల్లును ఆమోదించింది. ఇక ఈ బిల్లు చట్టంగా మారాలంటే రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంది.

# ఈ వాహనాల్లో చిన్న మార్పులు అవసరం.. ఈ20 పెట్రోల్‌పై కేంద్రం కీలక ప్రకటన

-మొదటి పేజీ తరువాయి

ఈ20 పెట్రోల్ తో వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతూ వస్తున్న కేంద్రం తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ20 వాడాలంటే 2016కు ముందు తయారైన కొన్ని వాహనాల్లో మాత్రమే స్వల్ప మార్పులు అవసరమవుతాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ముఖ్యంగా 2005 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన బీఎస్-3 ప్రమాణాల వాహనాల్లోని కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లను మార్చాల్సి రావచ్చని రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. సాధారణ సర్వీసింగ్‌లోనే ఈ మార్పులు చేయవచ్చని స్పష్టం చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అధ్యయనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందని మంత్రి చెప్పారు. ఈ20 పెట్రోల్‌తో పాత వాహనాల పనితీరులో గణనీయమైన మార్పులు లేదా అసాధారణ అరుగుదల కనిపించలేదని వెల్లడించారు. డ్రైవింగ్ సామర్థ్యం, స్టార్ట్ అయ్యే విధానం, లోహ భాగాలు, ప్లాస్టిక్ భాగాల పనితీరు వంటి అంశాల్లో కూడా ఎలాంటి సమస్యలు గుర్తించలేదని గడ్కరీ తెలిపారు. ఈ20 పెట్రోల్ వాడటం వల్ల మైలేజ్ తగ్గుతుందనే అభిప్రాయాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు. వాహనం మైలేజ్ అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఈ20 పెట్రోల్‌ను మాత్రమే కారణంగా చెప్పలేమని ఆటోమొబైల్ తయారీ సంస్థలు, పరీక్షా సంస్థలు స్పష్టం చేసినట్లు వివరించారు. 2020లో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అంతర్‌శాఖ కమిటీ ఇథనాల్ మిశ్రమ ఇంధనంపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందని మంత్రి తెలిపారు. ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, మన్నిక, కాలుష్య ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే ఈ20 పెట్రోల్‌ను దశలవారీగా అమలు చేశామని చెప్పారు. బ్రెజిల్ వంటి దేశాల్లో దశాబ్దాలుగా ఇంకా ఎక్కువ ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని విజయవంతంగా వినియోగిస్తున్నారని గుర్తు చేశారు.

# ప్రపంచంలో నాలుగో అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌గా పాకిస్థాన్

-మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయంగా పాకిస్థాన్ మరోసారి తీవ్ర అప్రతిష్ఠను మూటగట్టుకుంది. ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌లు కలిగిన దేశాల జాబితాలో పాకిస్థాన్ నాలుగో స్థానంలో నిలిచింది. లండన్‌కు చెందిన ప్రముఖ సంస్థ 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్' విడుదల చేసిన తాజా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో ఈ విషయం స్పష్టమైంది. ఈ జాబితాలో పాకిస్థాన్ కంటే కింద ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్ మాత్రమే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల పాస్‌పోర్ట్‌ల ప్రయాణ స్వేచ్ఛను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. ఇందులో పాకిస్థాన్ 101వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్ ప్రకారం, పాకిస్థాన్ పౌరులు ముందస్తు వీసా లేకుండా లేదా వీసా-ఆన్-అరైవల్ సదుపాయంతో కేవలం 29 దేశాలకు మాత్రమే ప్రయాణించగలరు. ఈ బలహీన ర్యాంకింగ్‌కు తోడు, ఇటీవలి కాలంలో పాకిస్థాన్ పౌరులు అనేక దేశాల నుంచి వీసా తిరస్కరణలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు పాకిస్థానీయులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధిస్తున్నాయి. గత నవంబర్‌లోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాక్ పౌరులకు వీసాలు జారీ చేయడాన్ని నిలిపివేసింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ అదనపు అంతర్గత వ్యవహారాల కార్యదర్శి సల్మాన్ చౌదరి సెనేట్ కమిటీ సమావేశంలో స్వయంగా ధృవీకరించారు. యూఏఈకి వెళుతున్న పాకిస్థానీయులు నేర కార్యకలాపాల్లో ఎక్కువగా పాలుపంచుకుంటున్నారనే ఆందోళనతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సెనేట్ మానవ హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్ సమీనా ముంతాజ్ జెహ్రీ వెల్లడించారు. కేవలం యూఏఈ మాత్రమే కాకుండా, సౌదీ అరేబియా సహా పలు గల్ఫ్ దేశాలు 2024 డిసెంబర్‌లో పాకిస్థాన్‌లోని సుమారు 30 నగరాల ప్రజలకు వీసాలపై నిరవధిక నిషేధం విధించాయి. విదేశాల్లో భిక్షాటన, స్మగ్లింగ్, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాలు పెరిగిపోవడమే ఈ ఆంక్షలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం డొమినికా, హైతీ, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక వంటి కొన్ని దేశాలు మాత్రమే పాకిస్థానీయులకు వీసా రహిత లేదా వీసా-ఆన్-అరైవల్ సౌకర్యాలను అంది స్తున్నాయి తాజా ర్యాంకింగ్స్ లో చైనా 60వ స్థానంలో నిలవగా, నిలువగా, భారత్ 81వ స్థానాన్ని దక్కించుకుంది. ఇక ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్ పోర్ట్ గా సింగపూర్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. సింగపూర్ పాస్ పోర్ట్ ఉన్నవారు 192 దేశాలకు ఎలాంటి ముందస్తు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. జపాన్, దక్షిణ కొరియా, యూఏఈ దేశాలు ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాయి.

# మన్మోహన్ సింగ్ పై ఉన్న క్రిమినల్ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు

-మొదటి పేజీ తరువాయి



బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారంలో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై నమోదైన క్రిమినల్ కేసును, ఆనాటి ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈరోజు పూర్తిగా రద్దు చేసింది. విచారణ సంస్థల ఆధారాలను తోసిపుచ్చి స్పెషల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును క్లోజ్ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన రెండు విభిన్న క్లోజర్ రిపోర్టుల్లో మన్మోహన్ సింగ్‌కు క్లీన్ చిట్ ఇచ్చిందని, అయినప్పటికీ ట్రయల్ కోర్టు సీబీఐ నివేదికను పక్కనబెట్టి సమన్లు జారీ చేయడంలో ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసు నేపథ్యం2005లో ఒడిశాలోని తలబిరా-×× బొగ్గు బ్లాక్ కేటాయింపుల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా, మాజీ బొగ్గు శాఖ కార్యదర్శి పి.సి. పరాఖ్‌లకు 2015లో నాటి ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను మన్మోహన్ సింగ్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, అత్యున్నత న్యాయస్థానం ఆనాడే సమన్ల అమలుపై స్టే విధించింది. ప్రధానిగా తన విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నానని, ఇందులో ఎలాంటి నేరపూరిత ఉద్దేశం లేదని మన్మోహన్ సింగ్ స్పష్టం చేశారు. తాజాగా సీబీఐ అందించిన క్లోజర్ రిపోర్టును ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తుది తీర్పునివ్వడంతో మాజీ ప్రధానిపై ఉన్న ప్రధాన ఆరోపణలు తొలగిపోయాయి.

# భారీ వర్షాలతో తడిసిముద్దయిన తెలంగాణ.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

-మొదటి పేజీ తరువాయి

**అక్షరకలం హైదరాబాద్:**



ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెం.మీ. వర్షపాతం నమోదు బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం తెలంగాణపై ఇంకా బలంగానే కొనసాగుతోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. వాతావరణ శాఖ సూచన ప్రకారం, బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడొచ్చని తెలిపింది. వర్షాలతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్‌లో జలదిగ్బంధం గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. ముఖ్యంగా ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో 9.64 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్ నగరం తడిసి ముద్దయింది. సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య కురిసిన కుండపోత వానతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఉద్యోగులు ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ కారిడార్ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ముషీరాబాద్, యూసుఫ్‌గూడ, షేక్‌పేట్, ఉప్పల్ ప్రాంతాల్లో రోడ్లపైకి మోకాళ్ల లోతు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. అప్రమత్తమైన అధికార యంత్రాంగం ారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తు చర్యగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

# శ్రీశైలానికి కృష్ణా జలాలు.. నేడు జలాశయానికి చేరనున్న వరద

-మొదటి పేజీ తరువాయి

కృష్ణా నదికి వరద ప్రవాహం ప్రారంభమైంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కర్ణాటకలోని జలాశయాలు నిండిపోవడంతో, అక్కడి నుంచి విడుదలవుతున్న వరద నీరు నేడు (బుధవారం) శ్రీశైలం జలాశయానికి చేరుకోనుంది. ఆలస్యంగానైనా వరద రాక మొదలవడంతో తెలుగు రాష్ట్రాల రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు నుంచి మంగళవారం సాయంత్రం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 30,000 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం వైపు విడుదల చేశారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు దాదాపు గరిష్ఠ మట్టానికి చేరుకోవడంతో భారీగా నీటిని దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి డ్యామ్ పూర్తి సామర్థ్యానికి కేవలం 4 టీఎంసీల దూరంలో ఉండటంతో, అక్కడి నుంచి సుమారు 80,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా నారాయణపూర్ డ్యామ్ నుంచి కూడా 84,300 క్యూసెక్కుల ప్రవాహం జూరాలకు చేరుతోంది. ఈ నేపథ్యంలో, జూరాల క్రస్ట్ గేట్లు కూడా ఎత్తే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. మంగళవారం నాటికి శ్రీశైలం ప్రాజెక్టులోకి ఇంకా వరద ప్రవాహం నమోదు కానప్పటికీ, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం జలాశయానికి పెద్ద ఊరటనివ్వనుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 41.279 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మరోవైపు, తుంగభద్ర జలాశయానికి కూడా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం నాగార్జున సాగర్‌లో 136.99 టీఎంసీలు, పులిచింతలలో 29.07 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాగా, గోదావరి బేసిన్ లోని పోలవరం వద్ద వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది.

# కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ

### -రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించిన ప్రజాప్రతినిధులు





జగిత్యాల / కొండగట్టు, జూలై 29: (అక్షర కలం)

గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులతో కలిసి ప్రజాప్రతినిధులు గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి మహిమ అపారమని, ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణలో పాల్గొంటారని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

### -ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ

గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు కల్పించిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలోని అత్యంత పవిత్రమైన ఆంజనేయ క్షేత్రాల్లో కొండగట్టు ఒకటని అన్నారు. భక్తుల విశ్వాసానికి నిలయమైన ఈ క్షేత్రానికి ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రకృతి అనుకూలించి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా భక్తులు పాల్గొనడం వారి అపారమైన భక్తికి నిదర్శనమన్నారు.

### -ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

గురు వ్యాస పౌర్ణమి గిరిప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేశారని, భక్తులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు కల్పించినట్లు వెల్లడించారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని తెలిపారు. ఈ ప్రదక్షిణలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పూజరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్






పెగడపల్లి, జూలై 29 (వార్త):

గ్రామాల సమగ్ర అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన గ్రామ, మండల అభివృద్ధి కార్యక్రమాల సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# ఎరువుల సమస్య ఉత్పన్నం కాకుండా చూసే బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే ఉంది

### -బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి



రాయికల్ జూలై 29 (అక్షర కలం):

విద్యుత్ మరియు ఎరువుల సమస్య ఉత్పన్నం కాకుండా చూసే బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే ఉందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో బుధవారం మాజీ జడ్పీ పర్సన్ దావ వసంత తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని తరలింపు చేసే అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి కేవలం బేష జాలం తోని కేసీఆర్ కు పేరు వస్తుందని నీటి తరలింపు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ రైతాంగం పై దయ లేనప్పటికీ దేవుడు దయతలిచి వర్షాలు రావడం రైతాంగానికి కొద్దిగా ఊరట కలిగించే విషయమని అన్నారు. ఖరీఫ్ పంట సాగు ప్రశ్నార్థకమైపోయిందనీ, రైతులు ఎం చేయాలో తెలియని పరిస్థితిలో రైతాంగం ఉంటే ఈ రోజు అల్పపీడనం దేవుడు దయతలచి ఈ వర్షాలు రావడంతోని రైతాంగానికి ఊరట కలిగిందన్నారు. పోసిన నార్లు ఎదిగిపోయి సిద్ధంగా ఉన్న నారు వేసే అవకాశం లేక రైతులు ఆందోళనలోతో ఉన్నారని, ఈ వర్షాలతో ఎదిగిన నారు నాటు వేసుకునే అవకాశం కలిగిందన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికి అయిన విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 24 గంటలు విద్యుత్ ఇచ్చి రైతాంగానికి తోడుగా నిలవడం జరిగిందో అదేవిధంగా ఇప్పుడు విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల విద్యుత్ అందిప చేయాలని అన్నారు. ఎరువులు ముఖ్యంగా అడుగు మందు 20-20 ఎరువు రకం 2150 రూపాయలు మరియు డీఏపీ 1950 రూపాయలు ఉన్నది అడుగు మందు కొరత లేకుండా బ్లాక్ కాకుండా రూ.1350 కి అందరికి అందుబాటులో ఉండే విదంగా అలాగే 20 20 కల్పింప చేయడంతో పాటుగా యూరియా అప్ కూడా తొలగింప చేయాలన్నారు. నిన్నటి వరకు రైతాంగాన్ని నిర్లక్ష్యంతో గాలికి వదిలేసిన ఈ రోజు దేవుడు కరుణించాడనీ అన్నారు. ఈ వర్షాలతోని రైతాంగానికి మళ్ళీ ఆశలు కలిగాయని, రైతులు సాగుకు ముందుకు వెళ్తున్నందుకు విద్యుత్ సమస్య ఫర్టిలైజర్ ఎరువులకు సంబంధించి అడుగు మందు కానీ యూరియా కానీ ఏ విధమైన సమస్య ఉత్పన్నం కాకుండా పూర్తి స్థాయిలో కల్పింప చేయడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# గురు పౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షి గారి జయంతి



గద్వాల్ టౌన్ అక్షర కలం:

స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గద్వాల నందు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య షేక్ కలందర్ భాష అధ్యక్షతన, తెలుగు విభాగం వారి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా "వ్యాస మహర్షి " జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఆషాఢ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవం జరుపుకుంటామని తెలియజేస్తూ, వ్యాస మహర్షి 4 వేదాలను, అష్టాదశ పురాణాలను, భారత, భాగవతాలను రచించి అందులో ఉన్న జ్ఞానాన్ని తమ శిష్యుల ద్వారా నలదిక్కులకు వ్యాపింప చేశారు. వారి రచనల ద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు దేశవ్యాప్తంగా పరిడవిల్లాయి. వీరు వ్యాప్తి చేసిన వేదజ్ఞానాన్ని ప్రపంచంలోని వివిధ దేశాలు కూడా అనుసరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే చంద్రమోహన్, IQAC కోఆర్డినేటర్ ఏ రాధిక, తెలుగు విభాగ అధిపతి ఎంహెచ్ నాగభూషణం, డాక్టర్ కే సత్యన్న, డాక్టర్ సత్తెమ్మ, డాక్టర్ వెంకటేశ్వరమ్మ, డాక్టర్ కరుణాకర్, ఎస్ శంకర్, వెంకటేశ్వర్లు, తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి నూకరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల సమావేశంలో భాగంగా ఈరోజు గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నూకరాజు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, మండలంలోని అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో, ఎంపీవోలు మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాల అమలు, వివిధ శాఖల పనుల పురోగతిపై తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి,మిషన్ భగీరథ ఏఈ, మండల విద్యాధికారి (ఎంఈఓ), రెవెన్యూ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు,ఏపీఓ, ఏపీఎం,ఐసీడీఎస్ సూపర్వైజర్, పశుసంవర్ధక శాఖ అధికారి, హౌసింగ్ ఏఈ తదితరులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. అలాగే గౌరవ సభ్యులు ప్రస్తావించిన వివిధ సమస్యలు, ప్రజా అవసరాలపై స్పందిస్తూ తగిన వివరణలు అందించారు. రానున్న రెండవ మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పూర్తి స్థాయి ఎజెండా అంశాలతో హాజరుకావాలని, ప్రతి అధికారి తన విధులను సేవా నియమావళి (సర్వీస్ రూల్స్)కు అనుగుణంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,వీబీజీ రామ్-జీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన సేవ



గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి

గద్వాల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి వెంట వచ్చిన బంధుమిత్రులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఐఈ సందర్భంగా శ్రీ జయంతి సోమశేఖర్ తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, అలాగే గురు పౌర్ణిమ సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆశీస్సులతో శ్రీలత టీచర్ దేవిధంగా దివంగత విజయ భాస్కర్ రెడ్డి మూడవ వర్ధంతిని పురస్కరించుకొని వారి సతీమణి పరిమళ, కుమారుడు నందకిషోర్ రెడ్డి, కోడలు అనూష, కుమార్తె అనూష కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం మహాదానమని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఆసుపత్రిలోని రోగులు, వారి బంధుమిత్రులు దాతలకు మరియు గద్వాల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ ఉద్యమ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్.



అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి

ఇల్లందు పట్టణంలోని లలిత కళామందిర్ రహదారి ప్రక్కన ఉన్న సాయిబాబాగుడిలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయంలో రాష్ట్ర తెలంగాణ ఉద్యమ వ్యవస్థాపకసభ్యులు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి బాబా మందిరం కమిటీ అధ్యక్షులు అన్నవరపు మల్లికార్జున్ దిండిగాల రాజేందర్ కు శాలువ కప్పి సత్కరించారు. దిండిగాల రాజేందర్ ఈ సందర్భంగా మందిరంలో ఉన్న భక్తులకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ఉద్యమ కెరటాలు నిలిచేనా?



మాతృదేశంలో జన చైతన్య ఉరుములు మెరుపులకు సంబంధిత ప్రవాసులు స్పందించడం సహజం. ప్రవాస భారతీయ యువత అలనాటి స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి జంతర్ మంతర్ పోరాటం దాకా ప్రతి ప్రజాప్రతిఘటనకు ప్రభావశీలంగా ప్రతిస్పందిస్తూనే ఉన్నది. మాతృదేశంలో యువత చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా విదేశాలలోని యువత నుంచి లభించిన స్పందన ఆశ్చర్యం కలిగించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ప్రజ్వరిల్లిన విద్యార్థి ఉద్యమానికి మద్దతుగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాలోని ప్రధాన నగరాలలో నిర్వహించిన ప్రదర్శనలలో ప్రవాస యువ భారతీయులు అంచనాలకు మించి పాల్గొన్నారు. పాలనా వ్యవస్థల్లో అవినీతి నిర్మూలనకై 2011లో అన్నా హజారే నిర్వహించిన ఉద్యమ సందర్భంలో కంటే ఎక్కువగా జంతర్ మంతర్ విద్యార్థుల పోరుకు ప్రవాస భారతీయ యువత స్పందించింది. అయితే గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయ సమాజం మాత్రం 'బొద్దింకల పోరు'పై ఆచితూచి స్పందించింది. ఈ దేశాలలో సీబీఎస్ఈ అనుబంధ భారతీయ పాఠశాలలు 170 దాకా ఉన్నాయి. ఈ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులలో, స్వదేశంలో వైద్య విద్యాభ్యాసానికి తాపత్రయ పడే వారి సంఖ్య తక్కువేమీ కాదు. 'నీట్' పరీక్షా కేంద్రాలు సైతం ఈ దేశాలలో ఉన్నాయి. 'నీట్' ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రాలు లీక్ కావడం, తరువాత ఆ పరీక్ష రద్దు కావడం, పిమ్మట ఇరాన్ యుద్ధం మూలంగా సీబీఎస్ఈ సంవత్సరాంత పరీక్షలూ రద్దయ్యాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ దేశాలలోని సీబీఎస్ఈ పాఠశాలల భారతీయ విద్యార్థులు నష్టపోయారు. అమెరికా, ఐరోపా, ఇతర పాశ్చాత్య దేశాలలోని భారతీయ విద్యార్థులు ఆయా దేశాల విద్యావిధానంలో విద్యనభ్యసిస్తారు. భారతీయ విద్యా విధానాలతో వారికి సంబంధముండదు. వివిధ పాశ్చాత్య దేశాలలోని ప్రవాస భారతీయులు ఉత్సాహంగా ముందుకు వచ్చి సీజేపీ పోరాటానికి బాసటగా నిలిచారు. అయితే గల్ఫ్‌లోని ప్రభావిత విద్యార్థులు కనీసం సామాజిక మాధ్యమాలలో కూడా తమ అసంతృప్తిని వ్యక్తీకరించలేదు! వర్తమాన భారత రాజకీయాలలో ఒక వినూత్న సంచలనాన్ని సృష్టించిన అభిజిత్ దీప్కే (సీజేపీని ప్రారంభించిన జెన్--జీ పోరాటకారుడు) భారతీయ యువత మానసిక అలజడిని సరిగ్గా అర్థం చేసుకున్నాడు. వారిలో పోరాట జ్వాల రగిలించాడు. అధికారాన్ని ప్రశ్నించే యువశక్తికి ప్రతీకగా ప్రభవించాడు. ప్రశ్న పత్రాల లీకులకు వ్యతిరేకంగా జరిగిన సీజేపీ ఉద్యమం యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తి, ఆగ్రహాన్ని సంపూర్ణంగా వ్యక్తం చేసేందుకు ఒక వేదిక అయింది. స్వదేశంలో అవకాశాలు లేకనే యువత విదేశీబాట పడుతోందనే విషయాన్ని నిజాయితీగా అంగీకరించాలి. ఆక్రోశం, ఆవేదన ఎంతగా ఉన్నా వాటిని వ్యక్తీకరించేందుకు అవసరమైన ధైర్యసాహసాలు అందరికీ ఉండవు. విదేశాలలో ఉన్నా, స్వదేశంలో ఉన్నా వర్తమాన సామాజిక అంశాల పట్ల స్పందించడం అనేది వ్యక్తుల చైతన్యశీలతపై ఆధారపడి ఉంటుంది. ప్రత్యేకించి వృత్తిపరంగా మెరుగైన అవకాశాలు, వ్యక్తిగత ఆర్థిక సమున్నతికి విదేశాలకు వచ్చే భారతీయులలో మాతృభూమిలోని సామాజిక ఉద్యమాలు, పోరాటాల పట్ల సహానుభూతి చూపేవారు ఎంతోమంది ఉండరు. అభిజిత్ దీప్కే వలే బోస్టన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన రాజన్ కిలెచంద్ దుబాయిలోని ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్తలలో ఒకరు. ఆ విశ్వవిద్యాలయానికి 25 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చిన వితరణశీలి. అయితే స్వదేశంలోని సామాజిక ఉద్యమాలపై ఆయన అంతగా ఆసక్తి చూపరు. సంపన్న ప్రవాస భారతీయులలోని అత్యధికులకు రాజన్ ఒక ప్రతీక. మొత్తం మీద స్వల్ప సంఖ్యలో ఉండవచ్చుగానీ విదేశాలలోని భారతీయ యువత మాతృభూమిలో సంభవిస్తున్న సంఘటనల పట్ల చురుగ్గా ప్రతిస్పందిస్తుందని చెప్పవచ్చు. ఈజిప్ట్ నుంచి బంగ్లాదేశ్ దాకా ఆగ్రహంతో గళమెత్తి ప్రభుత్వాలను కూల్చివేసిన యువత, కొత్త పాలకుల విధానాలను ప్రభావితం చేయడంలో విఫలమయిందనేది ఒక చేదు సత్యం. దశాబ్దం క్రితం ఇదే ఢిల్లీలో దుమారంతో పాటు ఒక ఆశను రేకెత్తించిన విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్ ఉద్యమం తదనంతర కర్తవ్య సాధనలో ఎంతవరకు సఫలీకృతమయిందనేది కూడా గుర్తు చేసుకోవాలి. రాజకీయ క్రీడల్లో భాగం కాకుండా భావితరాలకు మేలు జరిగేలా నిర్మాణాత్మకంగా అడుగులు ముందుకు వేయవలసిన బాధ్యత ఉద్యమిస్తున్న భారతీయ యువతపై ఉన్నది.

# విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, అత్యాధునిక వసతులు కల్పన

**-రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**-విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టుబడే అసలైన అభివృద్ధి**
**-రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**





అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో : ప్రభుత్వ విద్యా రంగంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అన్ని వసతులు కల్పించి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పోటీపడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలో బుధవారం విస్తృతంగా పర్యటించిన మంత్రి ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ. 4 కోట్ల 85 లక్షల వ్యయంతో అదనపు వసతి గృహం, డైనింగ్ హాల్, వంటగది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, వంట షెడ్లు, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ ఫెన్సింగ్ తదితర మౌళిక వసతుల నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అన్ని వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాల్లో జన్మించిన పిల్లలు కూడా కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలను నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్య అందించాలనే సంకల్పంతో భారీ స్థాయిలో నిధులు కేటాయించామని అన్నారు. ఈ పాఠశాలలో రూ. 4.85 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత విద్యార్థినులకు మరింత మెరుగైన వసతి, భద్రత, పరిశుభ్రత, విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తి దృష్టి సారించేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. పేదరికం కారణంగా చదువు ఆగిపోవద్దనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని ఆశతో ఆశ్రమ పాఠశాలలకు పంపుతున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని చదువును జీవిత లక్ష్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్య మాత్రమే జీవితాన్ని మార్చగల శక్తి అని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి నాణ్యమైన విద్య, మంచి విలువలు అందించాలని కోరారు. ప్రతి విద్యార్థిని సమాజానికి ఆదర్శంగా నిలిచే వ్యక్తిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. టీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఆశ్రమ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. వ్యక్తిగత ఆసక్తితో పాఠశాలల్లో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయడం అభినందనీయం అని అన్నారు. ప్రభుత్వం విద్యను సంక్షేమ కార్యక్రమంగా మాత్రమే కాకుండా రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే పెట్టుబడిగా భావిస్తోందని, పేద కుటుంబాల పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు చేరేలా అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతుల కల్పన జరుగుతున్నట్లు, విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి చేసుకొని బయటకు వెళ్లి బ్రతికేవిధంగా పాఠశాలలు తీర్చిదిద్దుతామన్నారు. పిల్లలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని, చదువుపై దృష్టి పెట్టాలని అన్నారు. చదువు సమాజంలో గౌరవం, గుర్తింపు ఇస్తుందని అదనపు కలెక్టర్ అన్నారు. ఐటిడిఎ, భద్రాచలం పీవో బి. రాహుల్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రైమరీ పిల్లలకు ఉద్దీపకం కార్యక్రమం చేపట్టామని, దీనికి సంబంధించి ఉద్దీపకం 1, 2 పుస్తకాలు మంత్రివర్యులు ఆవిష్కరించారని, ఉద్దీపకం- 3 పుస్తకాన్ని ఇప్పుడు ఆవిష్కరిస్తారని అన్నారు. పిల్లల చదువు తర్వాత ఉపాధి దిశగా గైడెన్స్ కి వారధి కార్యక్రమం చేపట్టనున్నట్లు పీవో తెలిపారు. పిల్లల చదువుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయ్ చంద్ర రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

**-పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**
**-ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్**





అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో: జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ఎస్‌పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలు వురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**-ఏఐపీకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్,**




అక్షర కలం / భద్రాచలం వ్యవసాయకార్మికులకుకరువుబత్యంగాఏడువేలఐదువ ందలరూపాయలు చెల్లించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిజాటోతు. కృష్ణ, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోకినపల్లి.ప్రభాకర్, అధ్యక్షత నజరిగింది.అందులోఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు నెలకొందని వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల హామీలను ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు పన్నెండు వేల రూపాయల జీవన బృతిఇస్తానన్న హామీనికూడానెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు మూడు నుండి మండల డివిజన్.కార్యాల యాల్లో డిమాండ్ తో కూడిన వినతి పత్రాలు సమర్పించాలని ఆగస్టు పాడువ తేదీన రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాకలెక్టర్. కార్యాలయ ంలోమెమో రాండంఇవ్వాలని ఆయనతెలియజేశారు.ఆగస్టు ఎరవై వ తేదీ తర్వాత ప్రభుత్వం పైడిమాండ్స్.నెరవేర్చకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు వ్యవసాయ కార్మికులు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాయిని. రాజు, చింతకాయల .సరళ, వెంకటమ్మ, శాస్త్రబోయిన.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

ఆట

# ‘ఇకపై పసుపు జెర్సీ ధరించను’.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు నేమార్ వీడ్కోలు

**16 ఏళ్ల బ్రెజిల్ జాతీయ జట్టు ప్రస్థానానికి ముగింపు 2026 ప్రపంచకప్‌లో ఓటమే తన చివరి మ్యాచ్ అని వెల్లడి డ్రెస్సింగ్ రూమ్ వివాదంపై స్పష్టతనిచ్చిన స్టార్ ప్లేయర్ ఇకపై తన పూర్తి దృష్టి క్లబ్ కెరీర్‌పైనేనని ప్రకటన**



బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం, ఆ జట్టు ఆల్-టైమ్ టాప్ స్కోరర్ అయిన నేమార్ జూనియర్ తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు. 34 ఏళ్ల నేమార్.. 16 ఏళ్లకు పైగా సాగిన తన జాతీయ జట్టు ప్రస్థానానికి వీడ్కోలు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. 2026 ఫిఫా ప్రపంచకప్ తర్వాత తన భవిష్యత్తుపై నెలకొన్న ఊహాగానాలకు తెరదించుతూ ఈ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. కోపా సుడాఅమెరికానా టోర్నమెంట్‌లో భాగంగా తన క్లబ్ శాంటోస్ తరఫున ఆడిన మ్యాచ్ అనంతరం నేమార్ ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. వెనిజులాకు చెందిన యూనివర్సిడాడ్ సెంట్రల్‌పై శాంటోస్ 4-2 తేడాతో విజయం సాధించిన తర్వాత అతడు మీడియాతో మాట్లాడాడు. 2026 ప్రపంచకప్‌లో రౌండ్ ఆఫ్ 16లో నార్వే చేతిలో ఓటమి పాలైన మ్యాచే బ్రెజిల్ తరఫున తనకు చివరిదని స్పష్టం చేశాడు. జాతీయ జట్టుతో తన ప్రయాణం ముగిసిందని, ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా వైదొలగుతున్నానని తెలిపాడు. “జాతీయ జట్టుతో నా ప్రయాణం ముగిసింది. నేను చరిత్ర సృష్టించాను, ఎంతో సంతోషంగా ఉన్నాను. నా రక్తాన్ని, నా జీవితాన్ని ఇచ్చాను. పసుపు జెర్సీ కోసం ఎల్లప్పుడూ పోరాడాను. కానీ, ఇకపై నేను జాతీయ జట్టుకు ఆడాలనుకోవడం లేదు” అని నేమార్ భావోద్వేగంగా వ్యాఖ్యానించాడు. ఈ ప్రకటనతో బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఒక శకం ముగిసినట్లయింది. నేమార్ పలు ఫిఫా ప్రపంచకప్‌లు, కోపా అమెరికా టోర్నమెంట్లు, ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు.

# ఐపీఎల్‌లో అత్యంత విలువైన టీమ్ ఇదే!




**ఐపీఎల్ విలువ రూ.1.97 లక్షల కోట్లు ఆర్సీబీ బ్రాండ్ విలువ రూ.2,987 కోట్లు సీఎస్కే నాలుగో స్థానానికి పరిమితం ఆర్సీబీ, రాజస్థాన్‌కు కొత్త యాజమాన్యాలు ఎస్ఆర్‌హెచ్ ఐదు, ఆర్ఆర్ ఆరో స్థానం డిజిటల్ వృద్ధితో ఐపీఎల్‌కు మరింత బలం** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా మరింత బలపడింది. హౌలిహాన్ లోకే విడుదల చేసిన 2026 ఐపీఎల్ బ్రాండ్ వాల్యుయేషన్ స్టడీ ప్రకారం లీగ్ మొత్తం వ్యాపార విలువ రూ.1,97,024.68 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.4 శాతం పెరిగింది. లీగ్ బ్రాండ్ విలువ కూడా రూ.41,106 కోట్లకు చేరి 10.3 శాతం వృద్ధి నమోదు చేసింది. బ్రాండ్ విలువలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సుమారు రూ.2,987 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రూ.3 వేల కోట్ల మార్కుకు చేరువైన తొలి క్రికెట్ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ముంబై ఇండియన్స్ దాదాపు రూ.2,528 కోట్లతో రెండో స్థానంలో నిలవగా, కోల్‌కతా నైట్‌రైడర్స్ సుమారు రూ.2,346 కోట్లతో మూడో స్థానం దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ రూ.2,336 కోట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. మిగిలిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సుమారు రూ.1,608 కోట్లతో ఐదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ దాదాపు రూ.1,541 కోట్లతో ఆరో స్థానం దక్కించుకుంది. పంజాబ్ కింగ్స్ రూ.1,513 కోట్లతో ఏడు, గుజరాత్ టైటాన్స్ సుమారు రూ.1,503 కోట్లతో ఎనిమిదో స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్ దాదాపు రూ.1,494 కోట్లతో తొమ్మిది, లక్నో సూపర్ జెయింట్స్ సుమారు రూ.1,168 కోట్లతో పదో స్థానంలో నిలిచాయి. 2026లో ఫ్రాంచైజీల యాజమాన్యంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌తో కూడిన కన్సార్టియం ఆర్సీబీని సుమారు రూ.17,042 కోట్ల విలువకు కొనుగోలు చేసింది. మరోవైపు మిట్టల్ కుటుంబం, అదర్ పూనావాలా కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను సుమారు రూ.15,797 కోట్ల విలువతో సొంతం చేసుకున్నారు. ఐపీఎల్‌కు ప్రపంచ పెట్టుబడిదారుల నుంచి లభిస్తున్న ఆదరణకు ఈ ఒప్పందాలు నిదర్శనమని నివేదిక పేర్కొంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సినిమా
CINEMA

# జీ5 సంచలనం.. ఎన్బీకే111, వెంకీ5 సహా భారీ చిత్రాలతో మెగా లైనప్!




**7 భాషల్లో భారీ కంటెంట్ లైనప్‌ను ప్రకటించిన జీ5 ఎన్బీకే111, వెంకీ5, వృషకర్మ వంటి క్రేజీ చిత్రాలు జీ5లో నివేదా థామస్, శ్రీకాంత్ ప్రధాన పాత్రల్లో కొత్త తెలుగు ఒరిజినల్స్ అన్నపూర్ణ, సితార వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలతో భాగస్వామ్యం** ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 సంచలన ప్రకటన చేసింది. తెలుగు, హిందీ, తమిళం సహా మొత్తం 7 భాషల్లో సినిమాలు, వెబ్ సిరీస్‌లతో కూడిన భారీ కంటెంట్ లైనప్‌ను ప్రకటించి ప్రేక్షకులలో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా తెలుగు ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా పలు క్రేజీ ప్రాజెక్టులను తమ జాబితాలో చేర్చింది. విషయానికి వస్తే, బాలకృష్ణ నటిస్తున్న ఎన్బీకే111, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా వస్తున్న వెంకీ5, మోహన్‌లాల్ నటిస్తున్న వృషకర్మ వంటి భారీ చిత్రాల థియేట్రికల్ విడుదల తర్వాత తమ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు జీ5 వెల్లడించింది. వీటితో పాటు నివేదా థామస్ ప్రధాన పాత్రలో ‘శ్రీమతి’, శ్రీకాంత్ కీలక పాత్రలో ‘అబ్జెక్షన్ మై లార్డ్’ అనే కొత్త ఒరిజినల్స్‌ను కూడా తీసుకురానుంది. ఈ భారీ లైనప్ కోసం జీ5 దేశంలోని పలు అగ్ర నిర్మాణ సంస్థలతో చేతులు కలిపింది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అలాగే హిందీలో వరుణ్ ధావన్ ‘హై జవానీతో ఇష్క్ హోనా హై’, కంగనా రనౌత్ ‘భారత్ భాగ్య విధాత’, బాబీ డియోల్ ‘బండార్’ వంటి చిత్రాలు రానున్నాయి. తమిళంలో నయనతార ‘హై’, ‘డీ మాంటే కాలనీ 3’ వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సందర్భంగా జీ5 ఉన్నతాధికారులు మాట్లాడుతూ, తాము కేవలం ట్రెండ్స్‌ను ఫాలో అవ్వడమే కాకుండా, కొత్త ట్రెండ్స్ సృష్టిస్తున్నామని తెలిపారు. ప్రేక్షకులకు విభిన్నమైన, సాంస్కృతిక విలువలతో కూడిన కథలను అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం వినోదమే కాకుండా స్పోర్ట్స్, ఏఐ ఆధారిత కథలు, యానిమేషన్ కంటెంట్‌తో సంపూర్ణ వినోద వేదికగా మారుతున్నామని వారు వివరించారు.

# సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు: నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు



**కేసు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి ఇప్పటికే అల్లు అర్జున్ కు మినహాయింపు అనారోగ్య సమస్యల కారణంగా విచారణకు హాజరుకాని ముగ్గురు నిందితులు డిజిటల్ ఆధారాలను నిందితుల న్యాయవాదులకు అందించాలని కోర్టు ఆదేశం** హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకున్న విషాదకర తొక్కిసలాట ఘటనపై నమోదైన కేసు విచారణను నాంపల్లి కోర్టు ఆగస్టు 17కి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంలో న్యాయస్థానం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. అనారోగ్య సమస్యల కారణంగా ఈ కేసులోని ముగ్గురు నిందితులు కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. హీరో అల్లు అర్జున్‌కు ఇప్పటికే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు లభించిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా ఛార్జ్‌షీట్‌తో పాటు కేసులోని డిజిటల్ పరికరాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలను తమకు ఇంకా అందజేయలేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన న్యాయస్థానం... ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్న అన్ని డిజిటల్ ఆధారాలు, వీడియో ఫుటేజీలు, పత్రాల కాపీలను తదుపరి విచారణ నాటికి నిందితుల న్యాయవాదులకు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఆగస్టు 17కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

## చేనేత చీరపై అబ్బురపరిచే హస్త కళను సృష్టించిన -గట్టుపల్ వాస్తవ్యులు చెరుపల్లి రాజు

అక్షర కలం, చౌటుప్పల్



గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన చెరిపల్లి రాజు,తండ్రి రాములు చేనేత హస్తకలతో అబ్బురపరిచే కళలను ప్రదర్శించారు.ఒకే చీరలో దేవుని గోపురం, నెమలిపై సుబ్రహ్మణ్య స్వామి,అఖండ జ్యోతి, ఏనుగులు, గుర్రాలు, గుట్ట, మొదలైనటువంటి కళాఖండాలను సృష్టించారు.ఒకే చీరలో ఇలాంటి చేనేత కళలను సృష్టించడం చాలా అరుదుగా కొంతమందికే సాధ్యమవుతుంది.ఈ చీరను తయారు చేయడానికి దాదాపుగా 30 రోజులు శ్రమించానని,97 కొయ్యల(చిటికి) నూలు,దారంతో తయారు అయ్యింది అని రాజు తెలియజేశారు.ఈ చేనేత కల సృష్టిని చూసిన పలువురు రాజుని అభినందించారు.

## మైనంపల్లిలో 'తెలంగాణ జలసిరి'పై ప్రత్యేక గ్రామసభ

అక్షరకలం దేవరకొండ



నీటి పొదుపుపై సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ అవగాహ నదైనంపల్లి, డిజిటల్ మీడియా: మైనంపల్లి గ్రామంలో సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ గారి అధ్యక్షతన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమంపై బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ... గ్రామంలో నీటి కొరత రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు పెరిగేలా "ప్రతి నీటి చుక్కను భూమిలోకి ఇంకేలా" తగిన చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ లాలూ నాయక్, పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, వార్డు సభ్యులు లక్ష్మీ ప్రశాంత్, సంతోష వెంకట్, సునీత బద్దు నాయక్, కొర్ర కిషన్ నాయక్, పులిజలా నాగరాజులతో పాటు గ్రామస్తులు గణేష్, లచ్చు, వెంకటయ్య మరియు పలువురు గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త ఎర్ర సైదులు భౌతికకాయానికి ఎమ్మెల్యే బాలు నాయక్ నివాళి

అక్షరకలం దేవరకొండ



దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఎర్ర సైదులు అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ బుధవారం కొండభీమనపల్లి గ్రామానికి చేరుకుని, ఎర్ర సైదులు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి ఎర్ర సైదులు చేసిన సేవలు ఎనలేనివని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్ ఖాన్, దేవరకొండ మండల అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతు వెంకటేష్ గౌడ్, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్, యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, స్థానిక సర్పంచ్ శ్రీను, గొట్టిముక్కల సర్పంచ్ పార్వతి-వెంకటేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు, నాయకులు ఎర్ర కృష్ణలతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజలు నమ్మొద్దు.. ప్రజలకు ధైర్యం చెప్పిన 9 వార్డ్ కౌన్సిలర్ రామలింగేశ్వర కామ్లే

గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి



గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు ఎదుట గుర్తుతెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ చల్లి నిమ్మకాయలు ఉంచి క్షుద్ర పూజలు చేసినట్లు కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ రామలింగేశ్వర కామ్లే వెంటనే అక్కడికి చేరుకుని ప్రజలకు ధైర్యం చెప్పారు. "చేతబడి, బాణామతి, క్షుద్ర పూజలు వంటి మూఢనమ్మకాలను నమ్మి భయపడవద్దు. ఇలాంటి వాటితో ఎలాంటి హాని జరగదు. కొందరు ఆకతాయిలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు" అని ఆయన తెలిపారు. ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు కౌన్సిలర్ స్వయంగా అక్కడ ఉన్న నిమ్మకాయలను తొలగించి, పసుపు, కుంకుమను శుభ్రం చేశారు . అనంతరం ఆ నిమ్మకాయలను కడిగి నీటిలో కలిపి ప్రజల ముందే తాగి, క్షుద్ర పూజల వల్ల ఎలాంటి అపాయం ఉండదని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి. భయాలకు కాదు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. మన వార్డు అభివృద్ధే అందరి లక్ష్యం కావాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. కౌన్సిలర్ చేసిన ఈ చర్యను వార్డు ప్రజలు అభినందిస్తూ, మూఢనమ్మకాలపై సమాజంలో అవగాహన పెంచేందుకు ఇది మంచి సందేశమని పేర్కొన్నారు.

# రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**
**-చందంపేట తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష**
**-వారం, పది రోజుల్లో భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావాలని ఆదేశం**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

రెవెన్యూ రికార్డులను పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం అయన నల్గొండ జిల్లా, దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చందంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని దేవరకొండ ఆర్డిఓ బి. పద్మ ప్రియతో కలిసి సందర్శించి తహసిల్దార్ సత్యనారాయణ, సిబ్బందితో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఇటీవల చేపట్టిన భూముల రీ సర్వే, అటవీ భూములు, రెవెన్యూ భూములు, సాధారణ సర్వే లో సమస్యలు, తదితర అంశాలపై గ్రామాల వారిగా ఆర్డిఓ, తహసిల్దారుతో సమీక్షించారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో పరిశీలన పక్కగా జరగాలని, ముఖ్యంగా అటవీభవములు, రెవిన్యూ భూములు ,ప్రభుత్వ భూముల సర్వే సమయంలో క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలోని బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టీలకు ప్రాధాన్యత ఇచ్చి ఆ రెండు గ్రామాలకు సంబంధించిన భూ రికార్డులను స్పష్టత వచ్చే విధంగా రూపొందించాలని చెప్పారు. వారం, పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలలో భూ రికార్డుల లో స్పష్టత తీసుకురావాలని తహసిల్దారును ఆదేశించారు. ఇందుకు గాను ప్రతిరోజు కనీసం 3 నుండి 4 గంటలు ఈ అంశంపై పనిచేయాలని ఆదేశించారు. భూముల రీ-సర్వే సందర్భంగా



తలెత్తుతున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండలంలో భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, రీ -సర్వే అంశాలను ఆర్డిఓ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొగిళ్ళకు సంబంధించి రికార్డులను ఇదివరకే పరిశీలించినందున వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పొగిళ్ల రికార్డులను కూడా సిద్ధం చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలి

**-ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలి**
**-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

ఎల్ నినో దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా, దేవరకొండ డివిజన్, చందంపేట ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా భూగర్భ జలాలు పెరిగే అవకాశం లేదని,ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు తాగునీటిని జాగ్రత్తగా పర్యవేక్షించాలని,సక్రమ నీటి సరఫరా తోపాటు, ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటల పై అవగాహన కల్పించాలని, కందులు, కూరగాయలు ,కీర దోస వంటి పంటలు సాగు చేసుకునేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఎట్టి పరిస్థితిలో భూములు పడావుగా ఉంచవద్దని, ఆరుతడి పంటలు వేసుకునేందుకు ఎంత విత్తనం కావాలన్నా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు యూరియా తక్కువగా వాడేలా చూడాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. వి బి జి రామ్ జీ కింద గ్రామాల వారిగా అవసరమైన అన్ని పనులను చేపట్టాలని, జలసిరి కింద నీటి సంరక్షణ నిర్మాణాలు, కమ్యూనిటీ సోక్ పిట్స్ చేపట్టాలన్నారు. వి-బి జి రాం -జీ కింద అన్ని గ్రామపంచాయతీలలో పనులు ఉండేలా చూడాలని చెప్పారు. ఊట కుంటలు, చెరువులలో పూడికతీత, గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నిర్మాణం, అంగన్వాడీ నిర్మాణం, సోక్ పిట్లు, సోలార్ లైట్ల వంటి పనులకు అంచనాలు రూపొందించి మంజూరు ఇవ్వాలని ఆదేదించారు.ప్రతి గ్రామపంచాయతీలో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో భాగంగా మండలంలో వివిధ గ్రామాలలో వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను పునరుద్ధ రించాలని, అంగన్వాడీ పనులు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలంలో రెండవ విడత మంజూరైన ఇళ్ల నిర్మాణానికి గుడిసెల పరిశీలన



కార్యక్రమాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి చెల్లింపులు ఆపవద్దని, అలాగే పెండింగ్లో ఉన్న పనులను కొనసాగించాలని అన్నారు. ప్రస్తుతం ముసురుతో కూడిన వర్షం పడుతున్నందున వనమహోత్సవం కింద మొక్కలు నాటాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎంపిడిఓ వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. గువ్వలగుట్టలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుపై శ్రద్ధ తీసుకోవాలని ఆర్డిఓ పద్మ ప్రియను కలెక్టర్ ఆదేశించారు. దేవరకొండ ఆర్ డి ఓ బి పద్మప్రియ, తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, తదితరులు ఈ సమావేశం లో పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితాయే లక్ష్యం : తహసీల్దార్ విజయ్ కుమార్

**-సర్ ప్రక్రియ పై రాజకీయ పార్టీలతో తహసీల్దార్ సమావేశం**

అక్షర కలం : చిట్యాల

పారదర్శక ఓటర్ల జాబితా తయారు చేయడం లక్ష్యంగా సర్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని చిట్యాల తహసిల్దార్ విజయకుమార్ అన్నారు చిట్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ హాలో విజయ్ కుమార్ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ 2026 లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని , ఓటర్ల హేతుబద్ధీకరణ ప్రక్రియలో తీసుకోవాల్సిన చర్యలపై వివరంగా చర్చించామని తెలిపారు ?పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఓటర్ల జాబితాలలో ఓటర్ల బదిలీలు, పేర్ల తొలగింపు మరియు కొత్త పేర్ల చేర్పులు ?వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను స్వీకరించామన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల జాబితా సవరణ ఎంతో కీలకమని, సర్ ప్రక్రియ సఫీగా సాగేందుకు మరియు పారదర్శకమైన ఓటర్ల జాబితా



రూపొందించేందుకు అధికారులకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని పలు పార్టీల నాయకులు హామీ ఇచ్చారని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల నాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శివన్నగూడెం ముంపు బాధితులకు ప్రభుత్వం అండ

**-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**
**-శివన్నగూడెం రిజర్వాయర్ బాధితుల సమస్యలను త్వరలోనే**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

శివన్న గూడెం రిజర్వాయర్ లో ముంపుకు గురైన నర్సిరెడ్డిగూడెం బాధితులకు ప్రభుత్వం తరపున సహాయం అందించేందుకు చర్యలు తీసుకొంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం అయన మర్రిగూడ మండలం, శివన్న గూడెం రిజర్వాయర్ లో ముంపునకు గురై శివన్న గూడెం రిజర్వాయర్ సమీపంలోని ముంపు బాధితులు స్వంతంగా నిర్మించుకున్న గృహాలను పరిశీలించారు. రిజర్వాయర్ ముంపుకు గురైన కుటుంబాలకు ప్రభుత్వం చింతపల్లి వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే 54 మంది ముంపు బాధితులు మాత్రం శివన్న గూడెం వద్ద ఒక ప్రైవేట్ వెంచర్ లో వారి సొంత నిధులతో ఇండ్లు నిర్మించుకొన్నారు.రిజర్వాయర్ ముంపుకు 287 కుటుంబాలు గురికాగా, అందులో 54 మంది స్వంత గృహాలు నిర్మించుకొన్నారని, అధికారులు కలెక్టర్ కు తెలిపారు. చింతపల్లి వద్ద ఇంకా 32 మందికి ప్రభుత్వ ప్లాట్స్ రావాల్సి ఉందని ,అయితే చింత పల్లి వద్ద కేటాయించిన ప్లాట్స్ కి నంబర్ల



కేటాయింపు, స్థలాలను భౌతికంగా అప్పగించడంలో ఆలస్యం వల్ల ప్రైవేట్ వెంచర్ లో గృహాలు నిర్మించుకున్నామని ,అందువల్ల తమకు ఇందిరమ్మ గృహాలకు ఇచ్చే మొత్తం 5 లక్షల రూపాయలను ఇవ్వాలని, అలాగే ఆర్ అండ్ ఆర్ సమస్యలను తీర్చాలని,ప్లాట్స్ కు సంబంధించి కోర్టులో పెండింగ్ లో ఉన్న భూమి వివాదం తీర్చాలని, నిర్మించుకొన్న గృహా సముదాయంలో రోడ్లు, టాయిలెట్లతోపాటు, గ్రామానికి బస్సు సౌకర్యం,పబ్లిక్ టాయిలెట్, దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ముంపు బాధితుల సమస్యలన్నీ విన్న తర్వాత జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శివన్నగూడెం రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులు ఇప్పటివరకు ఎంతవరకు చెల్లింపులు చేయడం జరిగిందో అలాగే ఇంకా ఎంత చెల్లించాల్సి ఉన్న వివరాలన్నీ తెలుసుకోవడం జరుగుతుందని, అలాగే ఇటీవలే వచ్చిన కోర్టు ఉత్తర్వుల ప్రకారం వివాదానికి సంబంధించిన భూమి విషయాన్ని 10, 15 రోజుల్లో అవార్డు పూర్తి చేసి తక్కిన వారికి ప్లాట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, అలాగే గ్రామస్తుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. దేవరకొండ ఆర్ డి ఓ శ్రీదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ యాదగిరి, మండల అధికారులు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బాధితురాలికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆర్థిక సాయం

## -నిమ్స్‌లో మెరుగైన వైద్యం

అక్షరకలం, చండూరు

చండూరు మండలం ?గుంద్రపల్లికి చెందిన పందుల యాదయ్య భార్య పద్మ వారం రోజుల క్రితం తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు, వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం వారు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలో బెడ్ కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా, ఆమెకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు రూ. 2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన ఎల్.ఓ.సి మంజూరు చేయించగా, ఆ సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసాల జనార్దన్ రెడ్డి, యువజన నాయకులు కాసాల నాగిరెడ్డి, ఉయ్యాల నరేందర్ లు స్వయంగా ఆసుపత్రికి వెళ్లి బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.



# పలువురు కుటుంబాలను పరామర్శించిన విప్ బీర్ల అయిలయ్య

-ఆత్మకూరు (ఎం) అక్షరకలం

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పలువురు కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆత్మకూరు మండల కేంద్రంలో ములుగు సరోజన మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లిన బీర్ల అయిలయ్య ,సరోజన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.అదే గ్రామానికి చెందిన కొండపల్లి సాంబ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించారు. సాంబ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఆత్మకూరు మండలం మోదుగుంట గ్రామానికి వెళ్లి, కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ సుదగాని కుమార్ గారి సతీమణి మహేశ్వరి గారు మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేశ్వరి చిత్రపటానికి నివాళు లర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి,



తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసి, పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# సర్ ప్రక్రియలో నల్గొండ మార్క్

## -డిజిటలైజేషన్ ముమ్మరం
## -గడువు తక్కువగా ఉంది, తప్పులు లేకుండా వేగవంతం చేయండి
## -సీఈవో సుదర్శన్ రెడ్డి ఆదేశం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

నల్గొండ జిల్లాలో 88.63 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని, ఇప్పటి వరకు 88.63 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ. ఆర్ ప్రక్రియ పై



సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి ఎన్యూమరేషన్ ఫారాలను 88.63 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతు ందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప్రక్రియకు 4,5 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని, అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ.ఆర్.ఓ లు ర్యాండం గా తనిఖీలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా.. రైతు దుర్మరణం





జమ్మికుంట, జూలై 29 (అక్షర కలం):

వ్యవసాయ పనులలో ట్రాక్టర్ అదుపుతప్పి రైతు మృతి చెందిన ఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. జమ్మికుంట పట్టణానికి చెందిన రైతు అరుకాల కుమారస్వామి మండలంలోని అంకుశపూర్ లో వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ కింద చిక్కుకున్న ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలి

## -జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

అక్షరకలం నల్గొండ

జిల్లాలో రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రస్తుతం 68 శాతం పూర్తైందని, మిగిలిన రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని, ప్రతిరోజూ కనీసం 5,000 మంది రైతుల నమోదు లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు. రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కందులు, పెసర్లు వంటి ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కూరగాయల సాగును కూడా విస్తరించేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయడంతో పాటు, రైతులకు పంటల ఎంపికపై అవసరమైన సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లోజిల్లా వ్యవసాయ



శాఖ అధికారి వినోద్ కుమార్ ,జిల్లా హార్టికల్చర్ అధికారి టి. శేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు పాల్గొన్నారు.

అక్షరకలం తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# శ్రీలక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న సీఎస్ సంజయ్ జాజు

## -వైటీడీఏ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం



అక్షరకలం యాదాద్రి భువనగిరి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం తన కుటుంబ సమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.
?వైటీడీఏ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం ఆలయ ముఖమండపంలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా సీఎస్ సంజయ్ జాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈఓ భవానీ శంకర్ ఆయన చేత ఈ ప్రమాణ స్వీకారం చేయించారు.

### -వేదాశీర్వచనం..

స్వామివారి దర్శనం అనంతరం వైదిక పండితులు సీఎస్ సంజయ్ జాజు దంపతులకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి శేషవస్త్రాలు, శ్రీస్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. ?రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు అన్ని రకాల భద్రతాపరమైన, దర్శన సంబంధిత ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేశారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

## -ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





అక్షరకలం బీబీనగర్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచించారు. వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన పీఏసీఎస్ నూతన పాలకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, నూతన చైర్మన్ శ్రీ గరిసె రవి దంపతులను, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలిగొండ మండల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు సుమారు రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. చైర్మన్ గరిసె రవి మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమానాయక్, సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బత్తిని సహదేవ్, పాశం సత్తిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు




అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకలను ఉపాధ్యాయులు స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీటం శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్ పాల్గొని ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ?ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే గురువుల పాత్ర సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని, గురువులను గౌరవించడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తాటి చంద్రమౌళి, పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జరి యాదగిరితో పాటు ఉపాధ్యాయులు కైలాసం, లచ్చిరెడ్డి, విజయలక్ష్మి, రవీందర్, యశోదరా రెడ్డి, రాధా, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# పులుల పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యమని ఫ్ఆర్వో పర్వేజ్ అహ్మద్ అన్నారు.

గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి



ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక అభ్యాస పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, పులుల సంరక్షణ,జీవవైవిధ్య పరిరక్షణ,అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో పర్వేజ్ అహ్మద్ మాట్లాడుతూ,పులులు ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని,వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అడవులు,వన్యప్రాణులను పరిరక్షించేందుకు చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం విద్యార్థులు పులుల సంరక్షణ,అడవుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన,చిత్రలేఖన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పులుల పరిరక్షణపై తమ ఆలోచనలను వ్యాసాలు,చిత్రాల రూపంలో సృజనాత్మకంగా ఆవిష్కరించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది,పాఠశాల సిబ్బంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు

## -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 29:



జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, ఎయిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ చర్యలను మరింత పటిష్టం చేసి, జిల్లాలో స్క్రీనింగ్ సేవలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో బహుళ రంగాల కార్యాచరణ వ్యూహం లక్ష్యాలను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని సూచించారు. చికిత్స పరిధిలోకి రాని హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన బహిరంగ ప్రదేశాలలో స్వీయ ప్రమాద అంచనా క్యూఆర్ కోడ్లను ఏర్పాటు చేసి స్వచ్ఛంద పరీక్షలను ప్రోత్సహించాలని, తద్వారా ప్రజలు ప్రమాదాన్ని అంచనా వేసుకుని సమీపంలోని పరీక్షా కేంద్రాలకు స్వయంగా వెళ్తారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ కార్మికులు, అధిక ప్రమాదం ఉన్న కార్మిక వర్గాల కోసం ప్రత్యేక ఆరోగ్య, హెచ్ఐవి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సామాజిక సంరక్షణ, మద్దతు, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హెచ్ఐవి బాధితుల సంక్షేమానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులు సంబంధిత ఆన్లైన్ పోర్టల్ల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎయిడ్స్ బాధితుల సహాయార్థం, ప్రజల సౌకర్యం కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1097 ఏర్పాటు చేయడం జరిగిందని, సందేహాల నివృత్తి, సమాచారం కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలో హెచ్ఐవి నియంత్రణ చర్యల పురోగతిని వివరించారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చెన్నూరు లో నూతన ఐసీటీసీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, లింక్ ఆర్ట్ సెంటర్ సిబ్బంది, హెచ్ఐవి పాజిటివ్ నెట్వర్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ పోస్టులకు భారీ స్పందన....

## -కొల్చారం, పాపన్నపేట మండలాల్లో 186 దరఖాస్తులు......

## -102 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు హాజరు....



మెదక్, జూలై 29( అక్షర కలం):

మెదక్ పట్టణంలోని సిడిపిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినట్లు మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ తెలిపారు.మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వెరిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 5 పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది వెరిఫికేషన్ కు హాజరైనట్లు సీడీపీఓ తెలిపారు.కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేసుకోగా, 38 మంది హాజరయ్యారు. పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది వెరిఫికేషన్ కు హాజరయ్యారు. భర్తీ జరుగుతున్న ఖాళీల్లో కొల్చారం మండలంలోని రంగంపేట--2, కొంగోడ్ సెంటర్--2, పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి సెంటర్--2, అర్కెల సెంటర్--2, లక్ష్మీనగర్ తండా అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని సీడీపీఓ వెంకటరమణమ్మ వెల్లడించారు.

# సౌర విద్యుత్ ఉత్పాదనలో..తెలంగాణపై దృష్టి ఎలా ఉంది..?

## -లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

## - పీఎం సూర్యఘర్ కింద సబ్సిడీలు, రుణాలు సులభతరం చేసినట్లు వెల్లడించిన కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి మంత్రి ప్రల్హాద్ జోషి

అక్షర కలం ఖమ్మం ఉమ్మడి బ్యూరో:

గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంతో పాటు, హరిత శక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన (PM-SGMBY)' అమలు తీరుపై లోక్‌సభలో ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం ప్రశ్నించారు. తెలంగాణలో ప్రస్తుత పురోగతిపై ఆరా తీశారు. దీనికి కేంద్ర నూతన, పరుత్పాదక శక్తి మంత్రి ప్రల్హాద్ జోషి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆ వివరాలు ఇలా..

దేశంలో కోటి ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చాలనే లక్ష్యంతో.. రూ. 75,021 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జూలై 2024 నాటికి దేశవ్యాప్తంగా వివిధ కేపాసిటీలలో మొత్తం 40,07,355 రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటయ్యాయి. దీనిద్వారా 48,21,986 గృహాలు లబ్ధి పొందాయి. నేషనల్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు రూ. 39,930 కోట్ల విలువైన 21,31,331 రుణ దరఖాస్తులు మంజూరు కాగా, రూ. 31,652 కోట్ల మేర రుణాలు పంపిణీ అయ్యాయి. సరళతర నిబంధనలు.. పథకం అమలును మరింత వేగవంతం చేయడానికి కేంద్రం అనేక చర్యలు చేపట్టింది. దరఖాస్తు చేసుకున్న 7 రోజుల్లోగా సాంకేతిక అనుమతులు, నెట్-మీటరింగ్ ఏర్పాటు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ బ్యాంకులతో కూడిన అనుసంధానం ద్వారా... రుణాలను అందిస్తున్నారు. లోడ్ పెంపుదల పరిమితిని 10 కిలోవాట్ల వరకు పెంచడంతో పాటు భౌతిక ఒప్పందాల అవసరం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని సులభతరం చేశారు. ?తెలంగాణలో కేపాసిటీల వారీగా సోలార్ ప్రగతి ఎంపీ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రిత్వ శాఖ 24.07.2026 వరకు తెలంగాణ రాష్ట్రంలో వివిధ కేపాసిటీల వారీగా ఏర్పాటైన సిస్టమ్‌లు, లబ్ధి పొందిన కుటుంబాల వివరాలు ఇలా. (Up to 2 kWp): రాష్ట్రంలో ఈ కేపాసిటీ కింద 98 సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటవగా,




దీని ద్వారా 144 కుటుంబాలు లబ్ధి పొందాయి. ? (2 - 3 kWp): ఈ విభాగంలో 7,502 సిస్టమ్‌లు ఏర్పాటయ్యి, సరిగ్గా అదే సంఖ్యలో 7,502 కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయి. ?(Above 3 kWp): భారీ కేటగిరీ అయిన ఈ విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 46,630 సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటయ్యాయి, దీని ద్వారా 61,812 కుటుంబాలు లబ్ధి పొందాయని వివరించారు.

# ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి.

గద్వాల్ టౌన్ అక్షరకలం:

రాష్ట్ర బీజేపీ, భారతీయ జనతా యువ మోర్చా పిలుపు మేరకు జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రోజు గద్వాల పట్టణంలోని శ్రీ విద్యా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి ?5,000 చొప్పున అందించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించలేదని, మొత్తం ?15 వేల కోట్ల బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. వెంటనే బకాయిలను విడుదల చేయకపోతే బిజెపి పార్టీ తరుపున ,యువ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (BJYM) నాయకులు డిమాండ్ చేయూడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ



నరసింహులు,కౌన్సిలర్ శాలన్న, చంద్ర శేఖర్,జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత మధు గౌడ్, రాష్ట్ర ఓబీసి మోర్చా అధ్యక్షుడు అనిల్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పరమేస్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## -గ్రామాల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు - మంత్రి పొన్నం ప్రభాకర్

అక్షర కలం, సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 29 :




సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మంజూరైన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో జరిగిన సమీక్షా సమావేశంలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగం, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, పంచాయతీరాజ్, రోడ్లు, విద్యా రంగం, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశానికి గైర్హాజరైన విద్యుత్ శాఖ ఏఈ తీరుపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభలకు సైతం ఏఈ హాజరుకావడం లేదని సర్పంచులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాతవాహన యూనివర్సిటీ పనుల కోసం రూ.15 లక్షలు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని మంత్రి అధికారులను నిలదీశారు. సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించి విద్యుత్ కనెక్షన్ అందించాలని ఆదేశించారు.హుస్నాబాద్ మండలంలో మంజూరైన 240 ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటికే 210 ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన ఇండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తే ఆయా ఇళ్ల మంజూరులను రద్దు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన గ్రామాలకే తదుపరి విడతలో ప్రాధాన్యతనిస్తూ అదనపు ఇండ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్బీ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొట్లపల్లి, పందిల్ల , కోహెడ రూట్లలో తక్షణమే ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ ఊరికి బస్సు రాలేదు అనే మాట నా దృష్టికి రావద్దని స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రైతులకు ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. హుస్నాబాద్ మండలానికి సమీపంలో నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఉన్నందున, మండలంలోని గ్రామాల్లో ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆయిల్ ఫామ్ సాగుకు అందుబాటులో ఉన్న సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పిట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో జలశక్తి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నీటి సంరక్షణలో ముందుండే గ్రామాలు అభివృద్ధిలోనూ ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. రెండున్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్న అర్హులైన రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.2.50 లక్షల సహాయంతో వ్యవసాయ బావులను తవ్వుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి సమస్యను సమష్టిగా చర్చించి పరిష్కరించుకుందామని, హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, ఎంపీడీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలి

## -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

అక్షర కలం: రంగారెడ్డి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను బి.ఎల్.ఓ. సూపర్వైజర్లు, ఏ.ఈ.ఆర్.ఓ.లు, ఈ.ఆర్.ఓ.లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను నియమ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి



ఉండేలా హేతుబద్ధీకరణను చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, వాటికి సంబంధించిన వివరాలు డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. జాబితా తయారు చేసిన తరువాత సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో దీనికి ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మ్యాపింగ్ అనంతరం అందిన తాజా డేటా ఆధారంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని అన్నారు. హేతుబద్ధీకరణలో ప్రధానంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో సాధ్యమైనంత వరకు 1,200 మంది ఓటర్ల పరిమితిని పాటించడంతోపాటు, ఒకే కాలనీ లేదా ఒకే నివాస




సముదాయానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కొన్ని కాలనీల్లో ఒకే కుటుంబం లేదా ఒకే నివాస సముదాయంలోని ఓటర్లు రెండు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజించబడిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి సమస్యలను ప్రస్తుత హేతుబద్ధీకరణ దశలో పూర్తిగా పరిష్కరించడం సాధ్యం కానప్పటికీ, ముసాయిదా ఓటరు జాబితా (Draft Roll) ప్రచురించిన తర్వాత ఫారం--8 ద్వారా సవరణలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు దిశగా పని చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలతోనూ నిరంతర సమావేశాలు కొనసాగిస్తున్నామని, అన్ని నియోజ కవర్గాలు, మండలాల్లో సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాల వివరాలను వారికి అందజే శామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం సమకూర్చే పట్టుపురుగుల పెంపకంపై రైతులు దృష్టి సారించాలి

## -జిల్లా కలెక్టర్ హైమావతి

అక్షర కలం, సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 29 :

అత్యధిక ఆదాయం సమకూర్చే పట్టుపురుగుల పెంపకంపై జిల్లా రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మేరా రేషన్ మేరా అభియాన్-2.0 (నా పట్టు నా అభిమానం 2.0) కార్యక్రమం కింద జిల్లా స్థాయి భాగస్వామ్య వర్గాల సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారి లత, పట్టు పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం చేపట్టిన చర్యలను వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో అత్యధిక ఆదాయం సమకూర్చేది పట్టు పరిశ్రమ అని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1313 ఎకరాలలో 482 మంది పట్టు రైతులు మల్బరీ సాగు చేస్తున్నారని అన్నారు. 2026-27 సంవత్సరానికి గాని 200 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటికి 42 ఎకరాలు చేరుకోవడం జరిగిందని అన్నారు. ప్రస్తుత ఎల్ నినో తరుణంలో రైతులను పట్టు పరిశ్రమకు మార్చడం కొంచెం సులభం అవుతుందని ఈ దిశగా పట్టు పరిశ్రమశాఖ అధికారులు రైతులను మోటివేట్ చేయాలని అన్నారు. పట్టుపురుగుల పెంపకానికి మన జిల్లా అనుకూలమైనదని అదేవిధంగా మార్కెటింగ్ అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. పట్టు పరిశ్రమ పరిశ్రమ ద్వారా రైతులకు నెలనెల ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో రెండు ఎకరాల మల్బరీ తోటలను పండించవచ్చని అన్నారు. ఒక ఎకరానికి సంవత్సరానికి 5 సార్లు పంట చేతికి వస్తుందని, 1 ఎకరాకి ఒక సంవత్సరంలో 2 నుంచి 3 లక్షల రూపాయల ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పట్టు పురుగుల పెంపకం ద్వారా ఆదాయాన్ని పొందుతున్న రైతులు జిల్లాలోని ఇతర రైతులకు పట్టు పరిశ్రమ ద్వారా పొందే ఆదాయాన్ని వివరించి వారికి పట్టుపురుగుల పెంపకంలో అవసరమైన సూచనలు, సలహాలు అందించి లాభదాయకమైన పట్టుపురుగుల పెంపకంపై రైతులకు ఆసక్తి కలిగేల చూడాలని అన్నారు. జిల్లాలో పట్టుపురుగుల మార్కెటింగ్ కొరకు అవసరమైతే



భూమిని కేటాయిస్తానని ఈ దిశగా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి అధికంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విజయవంతమైన పట్టు క్షేత్రాలకు రైతులతో టూర్లు నిర్వహించాలని అన్నారు. అలాగే భూగర్భ జలాలను పెంచుకునే దిశగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో విబి జి రాంజీ పథకం ద్వారా ఉచితంగా ఫామ్ పాండ్లను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరా రేషన్ మేరా అభియాన్ 2.0 రాష్ట్ర నోడల్ అధికారి తిరుపం రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






## -బాధ్యతయుతంగా సేవలందించండి..
## -రోగులకు ఇబ్బందులు రానీయద్దు..
## -ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి ..
## -కలెక్టర్ చిత్రా మిశ్రా.

కరీంనగర్, జూలై 29 ( అక్షర కలం ):

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.తనిఖీలో భాగంగా సదరం వేయిటింగ్ హాల్, ఫార్మసీ, సిటీ స్కాన్ విభాగం, ఆరోగ్యశ్రీ కౌంటర్, సీనియర్ సిటిజన్ వార్డు, ఎమర్జెన్సీ వార్డు, సర్జికల్ రూమ్, ఓపీ విభాగం, ఆపరేషన్ థియేటర్, ఎన్ఎస్డీ క్లినిక్, పల్మనాలజీ వార్డులను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంసీహెచ్ మాదిరిగా రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు తగిన బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఆస్పత్రిలో ఎక్కడైనా లీకేజీలు, మరమ్మత్తులు అవసరమైన ప్రాంతాలు ఉంటే వెంటనే పూర్తి చేయాలని టీజీఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, కనీస సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దని సూచించారు. ఫ్లోరింగ్, దెబ్బతిన్న గోడల మరమ్మత్తులు, తాగునీటి సరఫరా, వాటర్ స్టోరేజ్, విద్యుత్ పనులు, అంతర్గత రహదారులు, వైద్యుల గదుల్లో అవసరమైన సౌకర్యాలు, అదనపు బెడ్ల ఏర్పాటు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షపు నీరు ఆస్పత్రి ప్రాంగణంలో నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా ప్రతి వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### -ఆస్పత్రి నిర్వహణపై సమగ్ర సమీక్ష :

తనిఖీ అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఛాంబర్లో ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ సిబ్బంది వివరాలు, వారు పనిచేస్తున్న ఏజెన్సీలు, ఆస్పత్రి ఆదాయం-వ్యయాలు, నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.ప్రతి నెల, మూడు నెలలు, ఆరు నెలలు, వార్షిక ప్రాతిపదికన ఆదాయం-వ్యయాల బడ్జెట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన భవనాల అద్దెలు, అంబులెన్సులు, జనరేటర్లు, వైద్య పరికరాలు, ఏసీలు, సీసీ కెమెరాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఔట్సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, ఆస్పత్రి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలి

## -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 29:

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓ లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను బిఎల్ఓ సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను నియమ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా హేతుబద్ధీకరణను చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, వాటికి సంబంధించిన వివరాలు డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. ఎఎస్డి జాబితా తయారు చేసిన తరువాత సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యువరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 81 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సమన్వయంతో ప్రక్రియ వేగవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో 85 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి.....

## -త్వరలో వంద శాతం పూర్తి కానున్న వనపర్తి జిల్లా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ

## -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.....



మెదక్, జూలై 29(అక్షర కలం):

మెదక్ జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 90 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ. ఆర్ ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఓటర్లు 4,53140 కి గాను వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి వరకు 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను 90 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న పోలింగ్ స్టేషన్లు, 2 కి.మీ. కంటే ఎక్కువ దూరం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి రేషనలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు.డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4,5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ.ఆర్.ఓ లు ర్యాండం గా తనిఖీలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్డీఓ రమాదేవి, సెక్షన్ సూపరింటెండెంట్ గఫార్ , ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## జూలై 30న మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం

### -ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్

అక్షర కలం :రంగారెడ్డి

జిల్లాలో ఎగుమతులను పెంచడంతో పాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ప్రోత్సహించేందుకు డిస్ట్రిక్ట్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్ (District as Export Hub - DEH) కార్యక్రమం కింద మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం ఈ నెల 30వ తేదీ (గురువారం) ఉదయం 10.00 గంటలకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ), కొంగరకలాన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) అధికారుల సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ-డీఐ (MSME-DI), కామర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ శాఖ, APEDA, Hఘu²sY¦, ECGC, ఇండియా పోస్ట్ తదితర ఎగుమతి ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అఈ సందర్భంగా ఎగుమతులకు సంబంధించిన ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, ఎగుమతి విధానాలు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక సహాయం, ఈ-కామర్స్ ద్వారా వ్యాపార విస్తరణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా, ఎగుమతులు ప్రారంభించాలనుకునే ఔత్సాహిక ఎగుమతిదారులకు ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ కోడ్ (×జుజ) పొందే ప్రక్రియపై మార్గదర్శకాలు అందించడంతో పాటు, అవసరమైన పత్రాలతో హాజరయ్యే వారికి దరఖాస్తు ప్రక్రియలో సహాయ సహకారాలు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు, స్టార్టప్ సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఖీూాలు), ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువ పారిశ్రామికవేత్తలు మరియు ఎగుమతులపై ఆసక్తి ఉన్న వారందరూ ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ విజ్ఞప్తి చేశారు.

## కబ్జాకోరుల నుండి ఆస్తులు కాపాడిన ఘనత హైడ్రాదే!

### -తుంగతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న.

### -రాజకీయాలకతీతంగా మేధావులు యువత స్వాగతించాలి.

తుంగతుర్తి జూలై 29 అక్షర కలం

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కబ్జా కోరుల నుండి, ప్రభుత్వ ఆస్తులను కాపాడిన ఘనత హైడ్రా రంగనాథీనని, హైకోర్టు తప్పుదోవ పట్టించడం, బాధాకరమని, రాజకీయాలకతీతంగా మేధావులు, యువత, హైడ్రాన స్వాగతించాలని తుంగతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనలో భాగంగా ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి . గత ప్రభుత్వాలు తీసుకొని నూతన విధానాన్ని హైడ్రాను తీసుకురావడం జరిగింది. హైడ్రా యొక్క ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ భూములను. చెరువులను. నాలాలను. మరియు పార్కులను ఆక్రమించినకబ్జా కోరుల నుండి బడా పార్సరమికవేత్తల నుండి కొంతమంది రాజకీయనాయకుల ఆక్రమంలో ఉన్నటువంటి స్థలాలను సేకరించి రాష్ట్ర ప్రభుత్వం కాపాడుతుంది. ఉమ్మడి ఆస్తులను కాపాడడం మనందరి బాధ్యత. వారు ఎవరైనా ఎంతటి వారైనా ధనికులైన. పేదవారైనా. గిట్టని కొంతమంది అక్రమార్కులు హైకోర్టులో కేసులు వేసి హైడ్రా పని విధానాన్ని తప్పుదోవ పట్టించే విధంగా కేసులు వేయడం జరిగింది. ఇది ముమ్మాటికి తప్పు. హైదరాబాద్ చిన్న వర్షం వచ్చినా నాళాలు నిండి రోడ్లు జలమయమై హైదరాబాద్ ప్రజలకు నానా తిప్పలు జరిగేవి. తెలంగాణ ప్రజలారా. మేధావులారా విద్యావేత్తలరా మరి ముఖ్యంగా తెలంగాణ యువత. తెలంగాణ ఉద్యమకారులు. కవులు కళాకారులుమేల్కొని హైడ్రా చేసినటువంటి మంచి పనులను స్వాగతించడమే కాకుండా మీ మద్దతు పూర్తిగా హైడ్రా రంగనాథ్ ప్రకటించాల్సిన కోరుతూ ఉమ్మడి ఆస్తులను కాపాడే విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని. కబ్జా కోరులనుండి కాపాడబడిన చెరువులను నాలాలను మరియు కుంటలను ఉదాహరణగా తీసుకుంటే మన కళ్ళ ముందు కనపడేవి. బతుకమ్మ కుంట . ఎన్ కన్వర్షన్ గండిపేట చెరువు మనకు కనిపించట్లేదా. అందుకే మనమందరము కలిసికట్టుగా యజ్ఞం చేసి హైడ్రాను కాపాడుకోవాలని ఆయన కోరారు.

## స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగిసిన మూడు రోజుల స్పెషల్ ఎడ్యుకేషన్ ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్

గద్వాల్ టౌన్ అక్షరకలం



దంసమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన స్పెషల్ ఎడ్యుకేషన్ ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది. శిక్షణ కార్యక్రమం చివరి రోజున జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి శిక్షణా కేంద్రాన్ని సందర్శించి, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒక ప్రత్యేకమైన వ్యక్తిబాని, వారికి సేవ చేయడం ఒక వరమని అన్నారు. ఒక ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే (CWSN) నాణ్యమైన, సమాన అవకాశాలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సున్నితమైన దృక్పథంతో పనిచేయాలని ఆమె సూచించారు. తరగతి గదిలో ప్రతి విద్యార్థి అవసరాన్ని గుర్తించి, వారి సామర్థ్యాలను వెలికితీసే విధంగా బోధన కొనసాగించాలని, సమ్మిళిత విద్య (Inclusive Education) లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మూడు రోజుల శిక్షణలో సమ్మిళిత విద్యా విధానాలు, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల బోధన-అభ్యాస పద్ధతులు, వ్యక్తిగత విద్యా ప్రణాళికలు (IEPs), సహాయక పరికరాల వినియోగం, తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. శిక్షకులుగా రవిచంద్ర యాదవ్, బీసన్న, నర్సింహా, మురళీదర్ గారు పాల్గొన్నారని సమ్మిళిత విద్యా కో ఆర్డినేటర్ కర్రెప్ప తెలిపారు.

# ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు

### -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 29:

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు, ప్రహరీ గోడ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. చెన్నూరు పట్టణంలో నూతనంగా చేపట్టిన వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కోటపల్లి మండలం అర్జున గుట్ట సమీపంలో గల ప్రాణహిత నది తీరాన్ని సందర్శించి నీటి ప్రవాహం, సమీప పరిస్థితులను మండల తహశీల్దార్ రాఘవేంద్ర, సిఐ కృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, నదిలో నీటి ప్రవాహ తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రజా సంక్షేమ చర్యలను చేపట్టాలని తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను





సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మెనూ అమలు, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి పాఠశాలకు పంపించే విధంగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎన్డిఆర్ఎఫ్ సభ్యులతో ప్రస్తుతం నెలకొన్న వర్ష పరిస్థితులపై సమీక్షించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ఇండ్లు కూలిపోయిన బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణుల వివరాలతో జాబితా రూపొందించాలని, గర్భిణుల ప్రసవాలు ఆసుపత్రిలోని జరిగే విధంగా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారితో సమీక్షించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి

### -భారతీయ జనతా పార్టీ

### -రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న

### -జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు

వనపర్తి జూలై 29 ప్రతినిధి అక్షర కలం వై రమేష్

వనపర్తి జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మరియు యువ మోర్చా ఆధ్వర్యంలో ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.15,000 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ యువమోర్చా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా యువమోర్చా నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర



కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు యువమోర్చా జిల్లా అధ్యక్షులు అరవింద్,13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్,చిన్న రాయుడు, చందు,నవీన్,వెంకటేష్ నాయక్ కళాశాల విద్యార్థులు, భారతీయ జనతా యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేశారు.

# దేశ అభివృద్ధి అంటే కార్పొరేట్ సంస్థల అధిపతుల అభివృద్ధా..?

### -ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అక్బర్ అలీ, మేకల దాసు

మందమర్రి, జూలై 29 అక్షర కలం:

దేశం అభివృద్ధి చెందుతుందని చెబుతున్న ప్రధాని మోడీ, వారి దృష్టిలో అదాని లాంటి కార్పొరేట్ సంస్థల అధిపతుల అభివృద్ధే దేశ అభివృద్ధి అని భావిస్తున్నారా అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ, ప్రధాన కార్యదర్శి మేకల దాసు లు కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఏఐటియుసి మండల మహాసభలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్బర్ అలీ, మేకల దాసు లు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి అంటే సగటు మానవ జీవన అభివృద్ధి ప్రమాణాలకు సంబంధం లేకుండా, కేవలం కార్పొరేట్ ఆధిపతులైన అదాని లాంటి కార్పొరేట్ శక్తులకు ఈ దేశ సహజ సంపదలను కట్టబెట్టడం కోసం, ఈ దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్నటువంటి కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్చి, కార్మికులకు హక్కులు లేకుండా చేస్తుంటే అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు. అది కేవలం బిజెపి నాయకులకు, వారి అనునాయులైన పారిశ్రామికవేత్తలకు మాత్రమే అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. కార్మికులకు, ఈ దేశ రైతాంగానికి, విద్యార్థులకు, యువకులకు ఏమాత్రం అభివృద్ధి కాదని స్పష్టం చేశారు. దేశంలో మొట్టమొదటి సంఘంగా అవతరించినటువంటి మొదటి సంఘం ఏఐటియుసి, అనేక కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను సాధించుకున్నటువంటి ఏకైక కార్మిక సంఘమని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు అనేక వాగ్దానాలు చేసి విస్మరిస్తున్నారని ఆరోపించారు. చెన్నూరు నియోజకవర్గం నుండి కార్మిక మంత్రిగా ఉన్నటువంటి వివేక్ వెంకటస్వామి అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా విస్మరిస్తున్నారని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో డిస్టిక్ లేబర్ కమిషనర్ (డిఎల్సి) కార్యాలయం లేకపోవడం అత్యంత అవమానకరమని తెలిపారు. ఉమ్మడి జిల్లాలైనటువంటి కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో డిస్టిక్ లేబర్ కమిషనర్ కార్యాలయాలు ఉన్నాయని, మంచిర్యాల జిల్లాలో లేకపోవడం వల్ల కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘ దూరం ఆదిలాబాద్ కు రాకపోకలు సాగిస్తూ, ఇబ్బందులు పడుతుంటే ఇక్కడి కార్మిక శాఖ మంత్రి కి పట్టింపు లేదని విమర్శించారు. తక్షణమే జిల్లాకు డిఎల్సి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ పట్టణ, మండల నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటియుసి పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఎండి



రసూల్, ఉపాధ్యక్షుడిగా జే సమయం, పట్టణ కార్యదర్శిగా ఆంటోని దినేష్, సహాయ కార్యదర్శిగా హేమచంద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కోడూరి రమేష్ (హమాలి), కోశాధికారి సాధనవేణి ప్రభాకర్ లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా రాయబారపు వెంకన్న, అధ్యక్షులుగా జెట్టి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా బోయపోతుల కొమురయ్య, కోశాధికారిగా భూపతి సత్యనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటియుసి జిల్లా నాయకులు శైలేంద్ర సత్యనారాయణ, భీమానాథుని సుదర్శన్, ఇప్పకాయల లింగయ్య, వనం సత్యనారాయణ, మిట్టపల్లి పౌలు, కాదండి సాంబయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శులు మిట్టపల్లి శ్రీనివాస్, కామెరా దుర్గారాజు, ఎస్సిడబ్ల్యాయు పిట్ కార్యదర్శులు, ఏరియా నాయకులు కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య, గాండ్ల సంపత్, ఎగ్గేటి రాజేశ్వరరావు, కలవల శ్రీనివాస్, సంఘటిత సింగరేణి కార్మికులు, అసంఘటిత కాంట్రాక్ట్ కార్మికులు, హమాలి కార్మికులు, బ్యాండ్ వర్కర్స్ కార్మికులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# కార్మిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలి

## -గత ఆర్థిక సంవత్సరం లాభాల పై శ్వేతపత్రం విడుదల చేయాలి



మందమర్రి, జూలై 29 అక్షర కలం:

సింగరేణి కార్మికుల మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ సమస్యతో పాటు కార్మికులకు లాభాల్లో వాటా, సింగరేణి సంస్థ భవిష్యత్తు, కొత్త బొగ్గు బ్లాక్ ల కేటాయింపు విషయంలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి సాజన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ ప్రెస్ క్లబ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయిబాట కార్యక్రమంలో ఇచ్చిన నిరవధిక నిరాహార దీక్ష అల్టిమేటం కారణంగానే సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించిందని తెలిపారు. మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల విషయంలో యాజమాన్యం మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏరియా లోని కాసీపేట-1 గనికి చెందిన వెంకటేశ్వర్లు అనే కార్మికుడు తన కాలును పూర్తిగా కోల్పోయినప్పటికీ ఆయనను ఫిట్ గా ప్రకటించి, అండర్ గ్రౌండ్ విధులకు బదులుగా సర్ఫేస్ లో విధులు నిర్వహించాలని సూచించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇలాంటి తీవ్ర శారీరక వైకల్యం ఉన్న కార్మికుడి పరిస్థితిని మానవతా కోణంలో మరోసారి పరిశీలించాలని కోరారు. సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని వాస్తవికంగా, నిష్పక్షపాతంగా పరిశీలించి, న్యాయం చేయాలన్నారు. కేవలం నామమాత్రంగా మెడికల్ బోర్డు నిర్వహించి, కార్మికులను తిరిగి విధుల్లోకి పంపడం వల్ల వారి ప్రాణాలకు, ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే పరిస్థితి ఉండకూడదని సూచించారు. కార్మికుల శారీరక సామర్థ్యం, వైద్య పరిస్థితి, వారు నిర్వహిస్తున్న పనుల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభనష్టాల పూర్తి వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సుమారు 58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 62 మిలియన్ టన్నుల బొగ్గును డిస్పాచ్ చేసిందన్నారు. అదే విధంగా గతంలో సింగరేణిలో కార్మికుల ఉత్పాదకత సుమారు 5.5 టన్నులు ఉంటే, ప్రస్తుతం అది 7.5 టన్నులకు పెరిగిందన్నారు. సింగరేణి ఉత్పత్తి, డిస్పాచ్ పెరగడంలోనే కాకుండా కార్మికుల ఉత్పాదకత గణనీయంగా పెరగడంలో సైతం సింగరేణి కార్మికుల చెమట చుక్కలు, కష్టానికి, అంకితభావానికి, నిరంతర శ్రమకు ప్రధాన పాత్ర ఉందని తెలిపారు. కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తూ సంస్థ ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతను పెంచారని, వారి శ్రమ ఫలితంగానే సింగరేణి సంస్థకు భారీ ఆదాయాలు, లాభాలు సమకూరుతున్నాయన్నారు. 2024--25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 65 మిలియన్ టన్నుల డిస్పాచ్ తో సింగరేణి సంస్థకు 6,000 కోట్ల రూపాయలకు పైగా లాభాలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సైతం ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతలో గణనీయమైన పనితీరు కనబరిచిన నేపథ్యంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాల వివరాలను యాజమాన్యం కార్మికుల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు చెల్లించారని, ఈ ఏడాది సైతం కార్మికులకు పెరిగిన ఉత్పాదకతను, వారి శ్రమను పరిగణనలోకి తీసుకుని గతం కంటే తక్కువ కాకుండా మరింత మెరుగైన లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను కార్మికులకు దక్కకుండా చేయడం ఏ మాత్రం న్యాయం కాదని, లాభాల వాటాను తగ్గించే ప్రయత్నం చేస్తే కార్మికులు, యూనియన్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను రక్షించుకోవాలంటే తెలంగాణలో కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాక్ లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. మణుగూరు పికెపిసి-2 డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణికి కేటాయించాలని కోరుతున్న సమయంలో వేలం నిర్వహించడం అన్యాయమన్నారు. ఈ వేలంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జెన్ కో సంస్థ పాల్గొనడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన సింగరేణి సంస్థకు పోటీగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని మరో సంస్థ వేలంలో పాల్గొనే పరిస్థితి రావడం సరైన విధానం కాదన్నారు. జెన్ కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. జెన్ కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం జెన్ కో పాల్గొనకుండా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ చర్చించుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. తాడిచర్ల బ్లాక్ ను సింగరేణికి కేటాయించిన విధంగానే మణుగూరు పికేఓసి-2 డిప్ సైడ్ బ్లాక్ ను సైతం ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ కేవలం ఒక బొగ్గు కంపెనీ కాదని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉందని తెలిపారు. సింగరేణి భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, యాజమాన్యంపై ఉందన్నారు. కార్మికుల హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, కార్మికుల ప్రయోజనాలు, సింగరేణి సంస్థ భవిష్యత్తు, తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేందుకు యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, కేంద్ర కార్యదర్శి నాగనవేణి హరీష్, ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నవీన్, జాయింట్ కార్యదర్శులు నీరటి కార్తీక్, హర్షవర్ధన్, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శులు గౌతం, శ్రావణ్, జబీర్, కోశాధికారి శ్రావణ్, కాసిపేట-1 గని పిట్ కార్యదర్శి ప్రీత్ పాల్ సింగ్ లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

## -జిల్లా కలెక్టర్ అంకిత్.

## -జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో అధికారులకు ఆదేశాలు.

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:-

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న బ్లాక్ స్పాట్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రహదారులపై పశువుల సంచారం అధికంగా ఉండటం వల్ల, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు . రహదారులపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, సీటు బెల్టులు ధరించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలకు సంబంధించిన పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో సకాలంలో వైద్య సేవలు అందేలా బ్లాక్




స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో జనవరి నుండి ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీణవంకలో ఘనంగా గురు పూజా కార్యక్రమం

వీణవంక, జూలై29 ( అక్షర కలం ) :

గురు పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వీణవంక మండల కేంద్రంలో గురు పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీణవంక మండలానికి చెందిన ప్రముఖ వేద పండితుడు జగదీశ్వర్ శర్మను కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించి గురువుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువుల మార్గదర్శకత్వంతోనే సమాజం సన్మార్గంలో పయనిస్తుందని అన్నారు. విద్య, విలువలు, సంస్కారం అందించే గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువులను స్మరించుకోవడం భారతీయ సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. వేద పండితుడు జగదీశ్వర్ శర్మ ఆశీర్వచనం అందించి, దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గుజ్జ శ్రీనివాస్ రావు ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ బుద్ధ మహేందర్ గుప్తా, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహ రాజు , ఆకుల రాజేందర్ కనుమల గణపతి ,టంగుటూరి



రాజకుమార్, మండల ప్రధాన కార్యదర్శి కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ఉడుత కుమార్, అప్పాని కొమురయ్య ,పెద్దిమల్లరెడ్డి ముత్యాల రవీందర్ హరికృష్ణ దాట్ల వీరస్వామి నాగరాజు అశోక్ సంతోష్ భాస్కర్, అయిత రాంబాబు పత్తి దేవేందర్ రెడ్డి కార్యకర్తలు, వేద పండితులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తరుణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

## -గద్వాల జనరల్ ఆసుపత్రి ముందు విద్యార్థి సంఘాల ధర్నా



గద్వాల టౌన్, అక్షరకలం:

జోగులాంబ గద్వాల జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తరుణ్ అనుమానాస్పద మృతి ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం వివిధ విద్యార్థి సంఘాలు గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించాయి. పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు హాలింపాష బి ఆర్ ఎస్ వి, కోఆర్డినేటర్ పల్లయ్య, పీడీఎస్ యు రాజు ఏఐఎస్ఎఫ్, యు ఎస్ ఎఫ్ ఐ వామన్ పల్లి రంగస్వామి సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు తరుణ్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి మరణానికి కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ లెక్చరర్‌పై వెంటనే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. తరుణ్ కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబ సభ్యుడికి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు విద్యార్థి సంఘాల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా సమాచారం అందుకున్న ఆర్డిఓ ఘటనా స్థలానికి చేరుకుని తరుణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లా నోడల్ ఆఫీసర్ హృదయరాజు మాట్లాడుతూ, సమగ్ర దర్యాప్తు నిర్వహించి విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీతో కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు చర్చించి ధర్నాను తాత్కాలికంగా విరమించారు. అయితే విచారణ పారదర్శకంగా జరిగి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ ఆందోళన ఆగదని నాయకులు స్పష్టం చేశారు.

# బిజెపి ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవం



మందమర్రి, జూలై 29 అక్షర కలం:

మండలంలోని దుబ్బపల్లి సత్యనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి ఎండోమెంట్ సెల్ జిల్లా కోకన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువులు ఊట్ల వెంకట శాస్త్రి, మిట్టపల్లి సత్యనారాయణ శాస్త్రి, బిజెపి సీనియర్ నాయకులు డివి దీక్షితులు లకు గురు వందన చేసి, గురుపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ దారవేణి రవికుమార్, నాయకులు మిట్టపల్లి ప్రదీప్, ఎనగందుల సత్యం, సాయి తేజ లు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -డాక్టర్ గౌరీ ప్రసాద్

అక్షర కలం/ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:



వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మణుగూరు ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ సూచించారు. ప్రజలు తప్పనిసరిగా మరిగించి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలని, వేడిగా తయారుచేసిన తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహార పదార్థాలను వీలైనంత వరకు నివారించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, దోమతెరలు, దోమల నివారణ మందులు, పూర్తి చేతుల దుస్తులను ఉపయోగించాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు, తీవ్రమైన తలనొప్పి లేదా శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని డాక్టర్ గౌరీ ప్రసాద్ సూచించారు. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# నేరాల కట్టడికి పటిష్ఠ చర్యలు

**-పోక్సో, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**-రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి.. మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ -తనిఖీలో జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్**



మహమ్మదాబాద్. జూలై 29 అక్షర కలం :

నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ పోలీసు అధికారులకు సూచించారు. మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల నమోదు, దర్యాప్తు తీరు, పెండింగ్ కేసుల వివరాలు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోక్సో చట్టంపై తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల రక్షణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలను అరికట్టేందుకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

## -సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని డీఐజీ సూచించారు. గుర్తుతెలియని ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకులు, నకిలీ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అత్యాశకు గురై మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు.

## -రహదారి భద్రతపై విస్తృత ప్రచారం

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తరపున ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఐజీ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో జరిగే ప్రమాదాలపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం మరింత పెరిగేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు.

# ఘనపూర్ ప్రాజెక్టు సందర్శించిన ఎమ్మెల్యే....

**-గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.....**





కొల్చారం, జూలై 29(అక్షర కలం):

మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్ ఏడుపాయల మనదుర్గ ప్రాజెక్టును  బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కొల్చారం మండలం బి ఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి  సందర్శించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత మూడు నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఘనపూర్ ప్రాజెక్టు నిన్ను కుండల నిండడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.  దేవుని దయవల్ల వర్షాలు సమృద్ధి కురువడంతో రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని  సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్ గుప్తా, కొల్చారం మండలం యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు, కొల్చారం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పైతర సర్పంచ్ యాభన్న గారి రవితేజ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్ నరేందర్ రెడ్డి, సంతోష్ రావు, వేమారెడ్డి, కొమ్ముల యాద గౌడ్,  తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, కొంగోడు  సర్పంచ్ దుబ్బ గళ్ళ  స్వామి, తుక్కాపూర్ ఉప సర్పంచ్ ఆరే రవీందర్ , యువ నాయకులు కొమ్ముల సురేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ :

(అక్షర కలం,) నారాయణపేట జిల్లా రిపోర్టర్, జులై,29)

నారాయణపేట మండలంలోని కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్  ప్రియాంక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా వార్డు, ప్రయోగశాల, ఫార్మసీ, టీకాల నిల్వ గది, వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ విధుల్లో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత అధికారులను వివరణ కోరారు. నారాయణపేటలో జరుగుతున్న సమావేశానికి హాజరైనట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మహిళా వార్డులో చికిత్స పొందుతున్న గర్భిణితో కలెక్టర్ మాట్లాడి, ఆమె ఆరోగ్య పరీక్షల నివేదికలను పరిశీలించారు. గర్భిణి రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే అప్పక్‌పల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, గర్భిణికి అవసరమైన టీఫా స్కానింగ్ పరీక్షలు నిర్వహించి, నివేదికను మెడికల్ ఆఫీసర్ ద్వారా తనకు పంపించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. గతంలో బయోమెడికల్ వ్యర్థాల సేకరణకు వాహనం వచ్చేదని, ప్రస్తుతం రావడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాక్సినేషన్ సేవలకు అంతరాయం ఏర్పడుతున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, బయోమెడికల్ వ్యర్థాల సేకరణ వాహనం ఎందుకు రావడం లేదని డీఎంఅండ్‌హెచ్‌వోను ప్రశ్నించారు. సంబంధిత ఏజెన్సీకి వెంటనే నోటీసు జారీ చేయాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బయోమెడికల్ వ్యర్థాలను క్రమం తప్పకుండా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు. వెంటనే డీఈఈను ఆరోగ్య కేంద్రానికి పంపించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## -జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శన

అనంతరం కోటకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు జాజాపూర్‌లో జరుగుతున్న శిక్షణకు హాజరయ్యారని, ఒక ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, మరో ఉపాధ్యాయురాలు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వివరించారు. ఆరో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి, వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి అభినందించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులతో భౌతిక శాస్త్రం పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. గత విద్యా సంవత్సరంలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించే లక్ష్యంతో చదవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రోత్సహించారు. తరగతి గదిలోని విద్యార్థులతో మాత్రమే కాకుండా



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో పోటీ ఉంటుందని గుర్తుంచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అదే రోజు పునశ్చరణ చేస్తే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఆర్థిక స్వావలంబన సాధించి, తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని ప్రోత్సహించారు. చివరగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వంటగది వద్ద అపరిశుభ్రతను గమనించి శుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీవో పాఠశాలను తరచూ సందర్శించాలని ఆదేశించడంతో పాటు, వంటగదిలో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.  అనంతరం గ్రామంలోని చేనేత కార్మికుడి ఇంటిని సందర్శించిన కలెక్టర్, అక్కడ తయారవుతున్న సిల్క్ చీరలను పరిశీలించారు. చీరల తయారీకి అవసరమైన ముడిసరుకు, ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్, విక్రయాల వివరాలను గ్రామానికి చెందిన మాస్టర్ వీవర్ పడాకుల శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 29:

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ఉన్న రాళ్లవాగు ప్రాంతాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా రాళ్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేసున్నామన్నారు. పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, వర్షాకాలంలో భద్రతకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో, ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కోటపల్లి, నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున, అవసరమైతే ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా, పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 30 మంది శిక్షణ పొందిన సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ఏడాది వరదల సమయంలో గ్రామాలు నీటిలో చిక్కుకున్నప్పుడు బోట్ల సహాయంతో విజయవంతంగా



సహాయక చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు లు పాల్గొన్నారు.

# భారీ వర్షానికి కూలిన ఇల్లు

**-తృటిలో తప్పిన ప్రమాదం**

మందమర్రి, జూలై 29 అక్షర కలం:

పట్టణంలో మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పట్టణంలోని ఎస్వి టెంపుల్ ఏరియాలో అయిల్ల కనకమ్మ ఇళ్లు భారీ వర్షానికి కూలిపోయింది. కుటుంబ సభ్యుల అప్రమత్తంతో ఇంటి యజమానురాలు కనకమ్మ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకొని, స్వల్ప గాయాలతో బయటపడింది. కానీ వారి ఇంటి ముందు గది పూర్తిగా ధ్వంసం కావడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. కనకమ్మ పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో సాయంత్రం వేళ రొట్టెలు విక్రయిస్తూ, తన జీవనాన్ని కొనసాగిస్తుండగా, అకాల వర్షం ఆమెకు కన్నీళ్లను మిగిల్చాయి. సంఘటన స్థలాన్ని



పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పట్టణ ఎస్ఐ గోపతి నరేష్ లు సందర్శించి, ప్రమాద వివరాలను ఆరా తీశారు. అదేవిధంగా సమాచారం అందుకున్న మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్ తహశీల్దార్ కార్యాలయ సిబ్బందిచే విచారణ జరిపి, ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థ నిర్మాణాలలో



నివాసం ఉండే ప్రజలు అత్యవసర సహాయ కొరకు ప్రభుత్వ అధికారులను సంప్రదించాలని సూచి ంచారు. కూలి పని చేసుకుని జీవనం కొనసాగించే కనకమ్మ ఇల్లు భారీ వర్షానికి నేలమట్టం కావడం తోపాటు తృటిలో ప్రాణాపాయం నుండి బయట పడిందని, ప్రభుత్వ అధికారులు, సహృదయాలు కనకమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


# జలసిరి పనులను వేగవంతం చేయండి

**-ఊటకుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణంపై రైతులకు అవగాహన కల్పించాలి**

**-జిల్లా కలెక్టర్  చంద్రశేఖర్**

ఉమ్మడి నల్లగొండ బ్యూరో  అక్షరకలం

జలసిరి కార్యక్రమంలో భాగంగా రైతులు తమ వ్యవసాయ భూముల్లో పాంపాడు, ఇంకుడు గుంతలను నిర్మించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలతో జలసిరి పనులు, వనమహోత్సవ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో పాంపాడు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాల పెరుగుదలకు, వర్షపు నీటి సంరక్షణకు ఈ గుంతలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే వనమహోత్సవ కార్యక్రమాన్ని వేగవంతం చేసి విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రస్తుతం 50 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిన మండలాలు మిగిలిన పనులను వేగంగా చేపట్టి కనీసం 70 శాతం లక్ష్యాన్ని



త్వరలోనే చేరుకోవాలని అధికారులకు సూచించారు. జలసిరి, వనమహోత్సవ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేసి జిల్లాలో నీటి సంరక్షణ, హరితాభివృద్ధికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్  ఆదేశించారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda-508 001 (Telangana) Printed at Pittale Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda 508 001. (Telangana) Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955